## 1000 రోజుల ప్రజా పాలనకు ఘనమైన సంబరాలు





జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
ఆదివారం 6 సెప్టెంబర్ 2026
పేజీలు : 8

# చెన్నూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



- అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి
- అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు
- మంత్రి వివేక్ వెంకటస్వామి



# ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలు





- విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ.. సన్మార్గంలో నడిపించాలి
- ఏఐ యుగంలో ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



# లారీ లోడ్‌లో గంజాయి గుట్టు.రట్టు !

**2.400 కిలోల గంజాయి పట్టివేత.. రూ.60 వేల విలువ**
**ముందస్తు సమాచారంతో పోలీసుల తనిఖీలు.. లారీ డ్రైవర్ అరెస్ట్**
**జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు**



**ఆసిఫాబాద్,జిల్లా క్రైమ్ రిపోర్టర్ మున్నా ఖాన్ సెప్టెంబరు 5 ప్రజాజ్యోతి**అక్రమంగా గంజాయిని తరలిస్తున్న లారీ డ్రైవర్‌ను వాంకిడి పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 2.400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. వాంకిడి మండలం గోయగావ్ శివారులోని ఇండియన్ దాబా సమీపంలో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం నిఘా ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో లారీ డ్రైవర్ మహారాష్ట్రలోని బల్లార్పూర్‌కు చెందిన అజిత్ భయ్యాలాల్ (60)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 2.400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి మరిన్ని వివరాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని సీఐ వేణుగోపాల్ తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాంకిడి ఎస్సై మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం



**లక్షెట్టిపేట సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి):** మండలంలోని మిట్టపెల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం జరిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్షెట్టిపేట హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ అధ్యక్షులు బొడ్డు రవి జోసఫ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని అన్నారు. రేపు రాబోయే తరానికి అత్యంత విలువలు కలిగిన పౌరులను దేశానికి అందించడంలో ప్రధాన పాత్ర కేవలం ఉపాధ్యాయులది మాత్రమేనని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తి జీవితములో అత్యంత గౌరవప్రదమైనదని ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల పట్ల పిల్లలు విధేయత కలిగి సాగిపోవాలని అన్నారు. ఈ సమాజాన్ని ప్రభావితం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని హితవు పలికారు. ప్రపంచంలో ఏ స్థాయిలో నిలబడినా దాని వెనకాల ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున మన గురువులను సత్కరిస్తూ వాళ్ళ రుణం తీర్చుకునేందుకు ఎల్లవేలల సిద్ధంగా ఉండాలని విద్యార్థి లోకానికి సందేశమిచ్చారు. అనంతరం 25 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ ట్రస్ట్ తరఫున అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాతరాజు బానేష్, ప్రధానోపాధ్యాయులు బి గోపీనాథ స్వామి, ఉపాధ్యాయురాలు జి స్వప్న, అంగన్వాడి టీచర్ ఎన్ కనకదుర్గ, పంచాయతీ కార్యదర్శి ఏ రాజమణి, అంబేద్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, తగరపు సత్తయ్య, శనిగారపు భాస్కర్, వరలక్ష్మి, రాణి, తదితరులు పాల్గొన్నారు...

## పేదల భూముల పరిరక్షణకు బీజేపీ పోరాటం

**22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలి**
**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**



**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి ):**పేదల భూములను దోపిడీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ నిషేధిత భూముల జాబితాను తీసుకొచ్చిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. 22ఏ జాబితాను వెంటనే రద్దు చేసి, పట్టాలు కలిగిన నివాస, వ్యవసాయ భూములను ఆ జాబితా నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎంపీలు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిర్వహించిన 22ఏ మహా దీక్షలో రఘునాథ్ వెరబెల్లి మంచిర్యాల బీజేపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, పట్టాలు ఉన్నప్పటికీ అనేక మంది పేదల నివాస, వ్యవసాయ భూములను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పేదల భూములపై హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం, వారిని ఇబ్బందులకు గురిచేసే విధానాలను అనుసరించడం సరికాదన్నారు. పట్టాలు ఉన్న నివాస, వ్యవసాయ భూములను వెంటనే 22ఏ జాబితా నుంచి తొలగించాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని రఘునాథ్ వెరబెల్లి హెచ్చరించారు. పేదల భూముల పరిరక్షణ కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, దుర్గం అశోక్, పట్టి వెంకట కృష్ణ, అందుగుల శ్రీనివాస్, అమిరిశెట్టి రాజ్ కుమార్, బింగి ప్రవీణ్, స్వామి రెడ్డి, బూర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి లయన్స్ క్లబ్ చేయూత




**జన్నారం,సెప్టెంబర్5(ప్రజాజ్యోతి)**జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం బిస్కుల సరోజ రాములు దంపతుల కుమార్తె మానస వివాహానికి జన్నారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రోజున రూపాయలు 10000 అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు బండారు మారుతీ రాజు మాట్లాడుతూ నిరుపేద ఆడపడుచు వివాహానికి చేయూతనందించడం సంతోషంగా ఉందని, మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గోలి రాము,కోశాధికారి రాంసింగ్,ఆర్ సి జక్కు భూమేష్, ఆర్ సి సెక్రటరీ కస్తూరి సతీష్,మల్లికార్జున్, సభ్యులు నరెందులో గోపి,గోలి మణి,విజయ్ కుమార్,వెలగందుల సురేష్ ,అనుముల రాజన్న వావిలాల రాజు,కస్తూరి సతీష్ ,మల్లేష్, కొమురవెల్లి సందీప్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, యూత్ డిక్లరేషన్, జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలి

**విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్ భారీ ర్యాలీ**




**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ఫీజు రీయింబర్స్‌మెంట్ ను వెంటనే విడుదల చేయడంతో పాటు యూత్ డిక్లరేషన్‌ను అమలు చేసి, జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి వెంకటేశ్వర చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ ర్యాలీలో బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ యువజన విభాగం (బీఆర్ఎస్వై) రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగమైన యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థులు, యువత సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, బీఆర్ఎస్వై నాయకులు, ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 1000 రోజుల ప్రజా పాలనకు ఘనమైన సంబరాలు

## మంచిర్యాలలో దాదాపు 1000 బైక్‌లతో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ

**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి ):మంచిర్యాల:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పాలనను పురస్కరించుకుని మంచిర్యాల పట్టణంలో దాదాపు 1000 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంచిర్యాల ఎమ్మెల్యే లు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాసం నుంచి ప్రారంభమైన ఈ భారీ బైక్ ర్యాలీ బెల్లంపల్లి చౌరస్తా, వెంకటేశ్వర టాకీస్, ఐబీ చౌరస్తా, సీసీసీ కార్నర్ చౌరస్తా మీదుగా ఉత్సాహభరితంగా సాగింది. భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొనడంతో పట్టణంలో సందడి నెలకొంది. ఈ భారీ బైక్ ర్యాలీలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ పాల్గొని కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను పురస్కరించుకుని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని తమ సంఘీభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి



బానేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జాలే రాయలింగు, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీపతి మల్లేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి పాల్గొన్నారు. అలాగే మంచిర్యాల కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు, మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు వెయ్యి బైక్‌లతో నిర్వహించిన ఈ భారీ ర్యాలీ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పాలనను ఘనంగా జరుపుకుంటూ మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శనతో తమ ఐక్యతను చాటుకున్నారు.

# కుమారి గ్రామంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటన

**నేరడిగొండ, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** మండలంలోని కుమారి గ్రామంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం పర్యటించి ఇటీవల శుభకార్యాలు జరిగిన కుటుంబాలను పరామర్శించారు. కుమారి గ్రామానికి చెందిన ప్రజాజ్యోతి ప్రతినిధి వొర్స రాజు యాదవ్ గృహప్రవేశం ఇటీవల జరగగా, ఆ సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో తాజాగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కైరంకొండ ఉదయ్ ఇంటి సందర్శన అదేవిధంగా కుమారి గ్రామానికి చెందిన



యువకుడు కైరంకొండ ఉదయ్‌కు ఇటీవల వివాహం జరగడంతో, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారి ఇంటికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పిటిసి గడ్డం భీమ్ రెడ్డి, సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, కుమారి సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆదేపు రవి, రెడ్ల కమలాకర్ రెడ్డి, పోట్టవతి శ్రీనివాస్ వివన్ రాజేశ్వర్ సి. నిలేష్, కే. ఉదయ్, అలకంటి రమణయ్య, భూతి. అదేల్లుతదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఫలాలన్నీ అర్హులకు పక్కాగా అందాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 4 ,( ప్రజాజ్యోతి ).**ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అన్ని క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ అందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో అమలు అవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న ప్రతి ఒక్క పథకం అర్హులైన ప్రతి వ్యక్తికి చేరే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలులో ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే



స్పందించి పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, సిపిఓ గంగా రెడ్డి, డిఎంహెచ్ఓ రాజేందర్, వ్యవసాయ అధికారి సుజాత, హార్టికల్చర్ అధికారి రమణ, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**ఏడు గంజాయి మొక్కలు... రూ.70 వేల విలువ**




**తిర్యాణి, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** మండలంలోని అరటిపల్లి గ్రామంలో ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రెబ్బెన సీఐ సంజయ్‌కుమార్ తెలిపారు. అరటిపల్లి గ్రామానికి చెందిన మేసినేని చంద్రయ్య తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా ఇంటి పెరట్లో సాగు చేస్తున్న ఏడు గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని తెలిపారు.గంజాయి వంటి మాదకద్రవ్యాలను సాగు చేయడం చట్టరీత్యా నేరమని సీఐ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎవరైనా సంఘవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, తిర్యాణి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 38 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి**

**తరగతి గదిలో 'నువ్వు సాధించగలవు' అంటూ ప్రోత్సహించాలి**

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 5** ప్రజా జ్యోతి విద్యార్థులను సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి కలెక్టర్ 38 మంది ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తన శిష్యుల ఎదుగుదలనే గురుదక్షిణగా భావించే వ్యక్తి ఉపాధ్యాయుడేనన్నారు. సమాచారం గుప్పిట్లోకి వచ్చిన నేటి రోజుల్లోనూ ఉపాధ్యాయుల ప్రత్యక్ష బోధనకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. తరగతి గదిలో విద్యార్థులను 'నువ్వు సాధించగలవు' అంటూ ప్రోత్సహించి, వారిని ముందుకు నడిపించే మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. విద్యార్థులు వంద శాతం పాఠశాలలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. జిల్లాలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. అనంతరం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలన.. కాంగ్రెస్ లో జోష్

**ఆరు గ్యారెంటీల అమలుతో సంక్షేమ ఫలాలు: ఆత్రం సుగుణక్క**
**ఆసిఫాబాద్‌లో డీసీసీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**
**టపాసులు పేల్చి సంబరాలు.. భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు**
**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన: ఎమ్మెల్సీ దండే విట్టల్**

**ఆసిఫాబాద్, సెప్టెంబరు 5 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ప్రారంభించి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఆసిఫాబాద్‌లో ఆ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. డీసీసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల మీదుగా కొనసాగింది. పార్టీ జెండాలతో ద్విచక్రవాహనాలపై పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విట్టల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

**ప్రజల విశ్వాసానికి నిదర్శనం**

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ ప్రజలు ఉంచిన విశ్వాసానికి 1000 రోజుల ప్రజాపాలన నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ప్రజాక్షేత్రంలో నిరంతరం పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, పంట రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

**రైతులు, మహిళలు, పేదలకు అండగా..**

రైతులకు రైతు భరోసా, పంట రుణమాఫీ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని సుగుణక్క అన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. అర్హులైన నిరుపేదలను గుర్తించి



ఇళ్లు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని పేర్కొన్నారు.

**అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రాధాన్యం**

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పలు రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోందని సుగుణక్క అన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రస్తావిస్తూ.. గతంలో ప్రాజెక్టుల పేరుతో జరిగిన అవినీతికి భిన్నంగా ప్రజలు, రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులకు ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**ప్రజా సంక్షేమమే లక్ష్యం**

ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.రైతులు, మహిళలు, యువత, పేదలు, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వెనుకబడిన రంగాలను తిరిగి గాడిలో పెట్టేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.



**బైక్ ర్యాలీతో హోరెత్తిన పట్టణం**

1000 రోజుల పాలన సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీతో ఆసిఫాబాద్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల సందడి నెలకొంది. డీసీసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగింది. పార్టీ జెండాలు, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

**నాయకులు, కార్యకర్తల భారీ హాజరు**

కార్యక్రమంలో ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, డైరెక్టర్ రాంచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళి, టౌన్ అధ్యక్షుడు ఇమ్రాన్ హస్మి, డీసీసీ ఉపాధ్యక్షులు తరిఖ్, భీమ్‌రావ్, జిల్లా కార్యదర్శి శోభన్, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్ కోవా ఇందిర, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్ పాల్గొన్నారు.వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మంచిర్యాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు మంచిర్యాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిడా. పత్తి సునీత**

మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి ):మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ప్రతి సంవత్సరం లాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. పత్తి సునీత డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల ప్రాముఖ్యత, సమాజ నిర్మాణంలో వారి పాత్ర, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను వివరించారు. “ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు. విద్యార్థుల విజయానికి బలమైన పునాది ఉపాధ్యాయులే” అని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్పడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ ప్రసంగాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యాపకులను సత్కరించి తమ అభిమానాన్ని, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థినులకు విలువైన సూచనలు, ఆశీస్సులు అందించారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ బాధ్యతలను స్వీకరించి తమ ప్రతిభను ప్రదర్శించారు. స్వయం పాలన దినోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా, ఆనందంగా,



స్ఫూర్తిదాయకంగా సాగింది. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వారి మార్గదర్శకత్వం ఎంతో అవసరమనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

# ఇంధన ధరల మంట.. పన్నుల పేరుతో దోపిడీ?

**మంచిర్యాలరూరల్ సెప్టెంబర్05(ప్రజాజ్యోతి)**పెట్రోల్.. డీజిల్ ధరలు పెరుగుతున్న కొద్దీ సామాన్యుడి కుటుంబ బడ్జెట్ కుదేలవుతోంది. అంతర్జాతీయ ముడిచమురు ధరల ప్రభావం ఒకవైపు ఉంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులు మరోవైపు ఇంధన ధరను భారంగామారుస్తున్నాయి.వాహనదారుడి నుంచి వసూలవుతున్న ప్రతి రూపాయిలో ప్రభుత్వాల పన్నుల వాటా ఎంత? ప్రజలకు దక్కుతున్న ఉపశమనం ఎంత?అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**--రెండు ప్రభుత్వాల పన్నులు**

పెట్రోల్,డీజిల్ ప్రస్తుతం జీఎస్టీ పరిధిలో లేవు.కేంద్రం ప్రధానంగా ఎక్సైజ్ సుంకం,రాష్ట్రాలు వ్యాట్/సేల్స్ ట్యాక్స్ ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నాయి.తెలంగాణలో పెట్రోల్‌పై 35.20 శాతం వ్యాట్,డీజిల్‌పై 27 శాతం వ్యాట్ ఉన్నట్లు కేంద్ర పెట్రోలియం శాఖకు చెందిన పన్నుల వివరాలు పేర్కొంటున్నాయి.ఇంధన ధర పెరిగినప్పుడు శాతంపై ఆధారపడిన పన్ను వసూళ్లు కూడా పెరిగే అవకాశం ఉండటంతో.. ధరల పెరుగుదల ప్రభావం వినియోగ దారుడిపై మరింత పడుతోంది.

**--కేంద్రం మాట.. రాష్ట్రం మాట!**

ఇంధన ధరల విషయంలో కేంద్రం తరచూ రాష్ట్రాల వ్యాట్‌ను తగ్గించాలని సూచిస్తుంది. రాష్ట్రాలు మాత్రం కేంద్రం విధిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాయి.కేంద్రం--రాష్ట్రం పరస్పరం బాధ్యతలు గుర్తుచేసుకుంటుండగా.. చివరకు బిల్లు చెల్లించేది మాత్రం ప్రజలే.పెట్రోల్ ధర పెరిగితే ద్విచక్ర వాహనదారుడి నెలవారీ ఖర్చు పెరుగుతుంది.డీజిల్ ధర పెరిగితే




లారీలు, సరుకు రవాణా,వ్యవసాయ యంత్రాల నిర్వహణ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఆ ప్రభావం చివరకు నిత్యావసర వస్తువుల ధరలపైనా పడుతుంది.

**--పన్నులపై పారదర్శకత ఏదీ?**

ఒక లీటరు పెట్రోల్,డీజిల్ ధరలో ముడిచమురు వ్యయం ఎంత?రిఫైనింగ్ ఖర్చు ఎంత?కేంద్ర ఎక్సైజ్ ఎంత?రాష్ట్ర వ్యాట్ ఎంత? డీలర్ కమిషన్ ఎంత? అనే వివరాలు వినియోగదారుడికి స్పష్టంగా అందుబాటులో ఉండాలనే డిమాండ్ పెరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనం వినియోగదారుడికి ఎంత మేరకు చేరింది?ధరలు పెరిగినప్పుడు మాత్రం వెంటనే భారాన్ని ఎందుకు బదిలీ చేస్తున్నారు? అనే ప్రశ్నలకు ప్రభుత్వాలు సమాధానం చెప్పాల్సి ఉంది.

**--జీఎస్టీ పరిధిలోకి ఎందుకు తేవడం లేదు?**

పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలనే చర్చ చాలాకాలంగా కొనసాగుతోంది.అయితే కేంద్రానికి ఎక్సైజ్ ఆదాయం,రాష్ట్రాలకు వ్యాట్ ఆదాయం కీలకమైన నేపథ్యంలో ఈ అంశంపై ఏకాభిప్రాయం కుదరడం లేదు.ప్రజల ప్రయోజనం ముందు..పన్నుల ఆదాయం తర్వాత అనే విధానంతో కేంద్రం,రాష్ట్రం కలిసి నిర్ణయం తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

**--ప్రజలపై భారమెంత?**

పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు దాని ప్రత్యక్ష ప్రభావం వాహనదారుడిపైనే కనిపిస్తుంది. కానీ పరోక్షంగా రవాణా, వ్యవసాయం,వ్యాపారం, నిర్మాణం,సరుకు పంపిణీ రంగాలపై కూడా ప్రభావం పడుతుంది.అందుకే ఇంధన ధరలను కేవలం పెట్రోల్ బంక్ ధరగా కాకుండా.. మొత్తం ఆర్థిక వ్యవస్థపై పడే భారంగా చూడాల్సిన అవసరం ఉంది.

**--ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేనా!**

ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడం ప్రభుత్వాల హక్కే కానీ ఆ పన్నుల భారం ఎంత? దాని ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనం ఎంత? అనే లెక్కను కూడా ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.ఇంధన ధరలపై కేంద్రం--రాష్ట్రం రాజకీయ విమర్శలు చేసుకోవడం కంటే.. పన్నుల భారాన్ని తగ్గించి సామాన్యుడికి ఉపశమనం కల్పించడమే అసలు పరిష్కారం.ట్యాంక్ నింపేది ప్రజలు..ఖజానా నింపుకునేది ప్రభుత్వాలు..మరి ఈ భారానికి అంతం ఎప్పుడు అని ఎవరు తెలపాలి.

# కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నది

**దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ప్రభుత్వ రంగాన్ని బలహీనపరుస్తున్నది**

**సీపీఐ--ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు ఏఐటీయూసీ**

**రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి మంచిర్యాల ఐబీలో మహాసభల లోగో ఆవిష్కరణ**

**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ప్రభుత్వ రంగాన్ని బలహీనపరుస్తోందని సీపీఐ--ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు లు విమర్శించారు.ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ--ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను శనివారం మంచిర్యాల ఐబీలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్, మేకల దాసు మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించే కార్మికులు, రైతుల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో ఆర్థికాభివృద్ధి జరుగుతోందని, జీడీపీ పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ ఆ అభివృద్ధి సామాన్య ప్రజల జీవితాల్లో ఎందుకు కనిపించడం లేదని వారు ప్రశ్నించారు. జీడీపీ పెరుగుతున్నప్పుడు దేశంలో నిరుద్యోగ సమస్య ఎందుకు తీవ్రంగా ఉందని ప్రశ్నించారు. కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత ఎందుకు మెరుగుపడటం లేదని, రైతుల ఆదాయం, వారి జీవన ప్రమాణాలు ఎందుకు పెరగడం లేదని నిలదీశారు. జీడీపీ గణాంకాలు పెరగడం మాత్రమే దేశ అభివృద్ధికి కొల మానం కాదని వారు స్పష్టం చేశారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, కార్మికుల వేతనాలు పెరగడం, రైతుల ఆదాయం మెరుగుపడటం, ప్రజలకు మెరుగైన సామాజిక భద్రత అందడం వంటి అంశాలు మెరుగుపడినప్పుడే నిజమైన ఆర్థిక అభివృద్ధి జరిగినట్లుగా భావించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నుంచి కాపాడటం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, ఉద్యోగ భద్రత కల్పించడం, మెరుగైన వేతనాలు అందించడం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు, రైతులు, ప్రజాస్వామ్యవాదులు ఏకతాటిపైకి వచ్చి ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో జరిగే ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు భవిష్యత్ కార్మిక ఉద్యమానికి దిశానిర్దేశం చేసే విధంగా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 6,




7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలకు కార్మికులు, ఉద్యోగులు, రైతులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రామడుగు లక్ష్మణ్, మేకల దాసు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ--ఏఐటీయూసీ నాయకులు ఖలీందర్ అలీఖాన్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి పౌలు, లింగం రవి, కొట్టే కిషన్ రావు, వనం సత్యనారాయణ, మిర్యాల రాజేశ్వర్ రావు, చాడా మహేందర్ రెడ్డి, కాదండి సాంబయ్య, ఎగుడ మొండి, పానుగంటి సత్యనారాయణ, మంద యాదగిరి, బియ్యాల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 5 ,( ప్రజాజ్యోతి ).** నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలో పర్యటించి వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో, పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శనివారం బాసరలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, గోదావరి నది పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాల షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం భైంసా తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీ చేశారు. నోటీసుల జారీ, తదుపరి ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేసి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వారి సందేహాలను అడిగి తెలుసుకుని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఈఈలు అనిల్, సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, బాసర ఆలయ ఈఓ అంజనా దేవి, తహసీల్దార్లు పవన్ చంద్ర, శశి భూషణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో ఘనంగా తీజ్ ఉత్సవాలు

**విద్యార్థినులు చదువులో రాణించి పాఠశాలకు పేరు తీసుకురావాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



**నేరడిగొండ, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో బంజారా సంప్రదాయ తీజ్ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. బంజారా సంప్రదాయం ప్రకారం తీజ్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు విద్యలో రాణించి పాఠశాలకు, నేరడిగొండ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలలో కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, నాయకులు నకులుడు, మెర్సింగ్, లింబాజీ, గాడ్గే సుభాష్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తీజ్ పండుగ



**బోథ్, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)** మండలంలోని దన్నూరు కె బిర్లా గొంది గ్రామంలో తీజ్ పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు బుట్టలలో మొలకెత్తిన పచ్చని గోధుమ మొలకలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పండుగ యొక్క ప్రత్యేకతను తెలిపారు. అనంతరం వారు తెలుపుతూ ప్రకృతి పండుగ అని, పల్లెలు పచ్చగా పాడిపంటలతో కళకళలాడాలని ప్రకృతి దేవతలను వేడుకున్నట్లుగా పేర్కొన్నారు. తీజ్ పండుగ తమకు ఎంతో ప్రత్యేకమైనదని, సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యంగా తొమ్మిది రోజులపాటు ఆడపిల్లలు ప్రత్యేక ఉపవాసాలతో ఉంటూ పండుగను నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న గుండ రాజన్న.



**జన్నారం,సెప్టెంబర్5 (ప్రజాజ్యోతి)** సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శనివారం రోజున కొడంగల్ జూనియర్ కళాశాల లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రానా చేతుల మీదుగా జన్నారం మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించాలి

**రామకృష్ణాపూర్,సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** పట్టణంలో భవన నిర్మాణాలకు బిల్డ్‌నౌ ద్వారా అనుమతులు పొందిన తర్వాతే పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మరాలి కృష్ణ సూచించారు. అనుమతిలో పేర్కొన్న సెట్ బ్యాక్ పాటించడంతోపాటు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన రహదారులు, రోడ్డు మార్జిన్లలో అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లు, ఇతర నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

## హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 5 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో పేరు ఉన్న ఓటర్లకు హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేసి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు నోటీసులను పంపిణీ చేసే సమయంలో సంబంధిత ఓటర్లకు ధ్రువపత్రాలు సమర్పించాలని తెలియజేయాలని సూచించారు. సహాయ ఎన్నికల అధికారుల లాగిన్ లో గల వివరాలను త్వరగా పరిష్కరించాలని, ఈ నెల 5, 6, 12, 13 తేదీలలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ప్రచార దినోత్సవాలు నిర్వహించి ఫారం 6, 7, 8 లు స్వీకరించాలని, నిర్ణీత గడువులోగా హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం

**12 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.**

**? గురువు స్థానం వెలకట్టలేనిది**

**ఇంటర్నేషనల్ మాజీ జిల్లా కార్యదర్శి మారవేణిరాజన్న**



**ఖానాపూర్ సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి )** సమాజంలో గురువు స్థానం వెలకట్టలేనిదని, భావితరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులను సముచిత రీతిలో గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 డి మాజీ కేబినెట్ సెక్రటరీ మారవేణి రాజన్న అన్నారు.మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్ మారవేణి రాజన్న ప్రసంగిస్తూ మాతా, పిత, గురు, దైవం అన్న ఆర్యోక్తి ప్రకారం సమాజంలో తల్లిదండ్రుల తర్వాత అత్యున్నత స్థానం గురువుకే దక్కుతుందన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ, సమాజ పురోగతికి మార్గదర్శ కులుగా నిలిచే ఉపాధ్యాయుల రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదని అన్నారు. వారిని గౌరవించడం ద్వారానే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది అని పేర్కొన్నారు. అనంతరం విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించిన 12 మంది ఉపాధ్యాయులను శాలు వాలు, పూలమాలలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ కె. సన్నీత్ కుమార్, సెక్రటరీ లయన్ రాచమల్ల రాజశేఖర్, ట్రెజరర్ లయన్ పి. రాంచందర్, ప్రోగ్రామ్ చైర్‌పర్సన్ లయన్ కె. వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి సంధ్యారాణి ఉపాధ్యాయ బృందం లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# కేసీఆర్ రాజీనామా చేసి ప్రజా తీర్పును ఎదుర్కోవాలి



**కాంగ్రెస్ నేతల డిమాండ్**

**గత పదేళ్ల పాలనపై ప్రజల కు సమాధానం చెప్పాలి**

**డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్**

**కాంగ్రెస్ 1000 రోజుల పాలన పై ఆదిలాబాద్ లో భారీ బైక్ ర్యాలీ**

**ఆదిలాబాద్ బ్యూరో , సెప్టెం బర్ 5: (ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రె స్ ప్రభుత్వం ప్రజా సంక్షే మం, అభివృద్ధికి ప్రాధాన్య తనిస్తూ సాగిస్తున్న పాలన కు 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదిలా బాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున 1,000 రోజుల ప్రజా పాలన బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు, యువ జన కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయ వంతం చేశారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కోమరం భీమ్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, డీటీసీ చౌక్, గాంధీ చౌక్, అంబేద్క ర్ చౌక్, నెహ్రూ రోడ్డు, నేతా జీ చౌక్, గర్ల్స్ హైస్కూల్ మీ దుగా తిరిగి డీసీసీ కార్యాల యానికి చేరుకుంది. మార్గ మధ్యంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

**కేసీఆర్ రాజీనామా చేయాలి**

అంబేద్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన సభలో డీసీసీ అధ్య క్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్ తో పాటు పలువురు కాంగ్రె స్ నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా గత ప దేళ్ల బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ నాయకులు విమ ర్శలు చేశారు.పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీ ఆర్ తన పాలనకు సంబంధించిన ప్రజా సమస్యలపై స మాధానం చెప్పాలని, రాజకీయ బాధ్యత స్వీకరించి రాజీనామా చేసి ప్రజా తీర్పును ఎదుర్కోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తదితర అంశాల్లో ప్రజలు ఎదుర్కొ న్న సమస్యలకు గత ప్రభు త్వం సమాధానం చెప్పాల్సి న అవసరం ఉందన్నారు.డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెం డింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒ క్కొక్కటిగా పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతోంద న్నారు. సంక్షేమ పథకాల ప్ర యోజనాలను అర్హులైన ప్ర జలకు అందించడంతో పా టు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇ స్తోందని తెలిపారు.

**వ్యక్తిగత విమర్శలు కాకుండా ప్రజా సమస్యలపై చర్చ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై బీఆర్ఎస్ నాయ కులు చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ నాయకులు స్పం దించారు. వ్యక్తిగత విమర్శ లకు పరిమితం కాకుండా ప్రజా సమస్యలు, నిరుద్యో గం, రైతుల సమస్యలు, సం క్షేమం, అభివృద్ధి వంటి అం శాలపై రాజకీయ చర్చ జర గాలని వారు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై కూడా కాంగ్రెస్ నాయకులు తమ అభిప్రా యాలను వెల్లడించారు. ధ రల పెరుగుదల, నిరుద్యో గం, రైతుల సమస్యలు, సా మాన్య ప్రజల సంక్షేమం వంటి అంశాలపై కేంద్ర ప్రభు త్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంద న్నారు.కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రి గా చేయటమే కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల లక్ష్యం అని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ నాయకులు, కా ర్యకర్తలు ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని నాయకులు పి లుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసు కెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరస య్య, మార్కెట్ కమిటీ చైర్మ న్ భోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సా జిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి, ఐ ఎన్ టీయూసీ నాయకుడు మునిగేలా నర్సింగ్,యూత్ కాం గ్రెస్ నాయకుడు చరణ్ గౌ డ్, జిల్లా మీడియా కో ఆర్డి నేటర్ మేకల జితేందర్, ఎస్సీ సెల్ చైర్మన్ పరమేశ్వర్ కాంగ్రెస్ నాయకులు, కార్యక ర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు.

# కేటీఆర్ మెప్పు కోసం బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు

**ప్రజలు తిరస్కరించినా తీరు మారలేదు.. యువత భవిష్యత్తుతో చెలగాటం వద్దు**

**ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కేటీఆర్ మెప్పు కోసం బాల్క సుమన్ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మండిపడ్డారు. ప్రజలు తిరస్కరించిన తర్వాత కూడా తన వైఖరిని మార్చుకోకుండా నిరాశతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రజల తీర్పును గౌరవించి గత అనుభవాలను ఆత్మపరిశీలన చేసుకోవాలని బాల్క సుమన్‌కు సూచించారు. పదేళ్ల పాటు ఎంపీగా, ఎమ్మెల్యేగా అధికారంలో ఉన్న సమయంలో ప్రజల కోసం ఏం చేశారో ప్రజలు గమనించారని, అందుకే తమ తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం లేదనే అసహనంతో గోడలు బద్దలు కొడతామని, బాంబులు వేస్తామని, పోలీసు అధికారులపై దాడులు చేస్తామని మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఎంపీ ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువతను రెచ్చగొట్టడం, తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి చెన్నూర్ అభివృద్ధి, యువత భవిష్యత్తు, విద్య, ఉద్యోగ అవకాశాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వంశీకృష్ణ తెలిపారు. అలాంటి నాయకుడిపై కేవలం కేటీఆర్ మెప్పు పొందేందుకు బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. విమర్శలు చేయాలనుకుంటే ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలని సూచించారు. యువతను రాజకీయాలకు ఉపయోగించుకోవడం కాకుండా వారి భవిష్యత్తును నిర్మించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందన్నారు. చెన్నూర్ యువత, విద్యార్థులు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల సమస్యలపై బాధ్యతగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. బాల్క సుమన్ గతంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు, ఇసుక మాఫియా, భూ మాఫియాకు సంబంధించిన ఆరోపణలు, యువతను మోసం చేశారనే ఆరోపణలు ప్రజల్లో ఉన్నాయని ఎంపీ వంశీకృష్ణ విమర్శించారు. అయితే ఆయా ఆరోపణలపై ప్రజలు ఇప్పటికే తమ తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల తీర్పును గౌరవించి ఇకనైనా బాధ్యతాయుతమైన, నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని, యువత, విద్యార్థుల విషయంలో ఎవరినీ బెదిరించేలా లేదా తప్పుదోవ పట్టించేలా వ్యవహరించకూడదని సూచించారు. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. "కేటీఆర్ పిల్లలు మాత్రమే మంచి పాఠశాలల్లో చదవాలా? తెలంగాణ పిల్లలు కూడా జర్మనీ, జపాన్, అమెరికా వంటి దేశాలకు వెళ్లి చదువుకోవాలి. మన పిల్లలకు కూడా ప్రపంచస్థాయి విద్య, ఉద్యోగ అవకాశాలు రావాలి" అని అన్నారు. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించేందుకు మంత్రి వివేక్ వెంకటస్వామి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. యువతకు మెరుగైన విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం, తమ బృందం కృషి చేస్తున్నాయని, ప్రతి సంవత్సరం 25 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా యువతకు అవకాశాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు .ప్రజల కోసం, యువత కోసం, ఉద్యోగాల కోసం చేస్తున్న పోరాటాన్ని ఎన్ని అడ్డంకులు ఎదురైనా కొనసాగిస్తామని వంశీకృష్ణ స్పష్టం చేశారు. కేటీఆర్ మెప్పు కోసం అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, ప్రజల తీర్పును గౌరవించి యువత భవిష్యత్తు కోసం పనిచేయాలని బాల్క సుమన్‌కు సూచించారు. మాటల్లో కాకుండా చేతల్లో ప్రజలకు సేవ చేసి చూపించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ హితవు పలికారు.

# మేము చేసిన అగ్రిమెంట్లతో వస్తాం... మీరు చేసిన అగ్రిమెంట్లు తీసుకొని రండి..!

## 11 డివిజన్లలో ఎక్కడైనా.. ఏ తేదీనైనా.. ఏ వేదికపైనైనా బహిరంగ చర్చకు ఏఐటీయూసీ సిద్ధం

### ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య బహిరంగ సవాల్

**మంచిర్యాల, 5, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ సాధించిన అగ్రిమెంట్లపై సోషల్ మీడియాలో, బహిరంగంగా విమర్శలు చేస్తున్న ఇతర కార్మిక సంఘాల నాయకులు ముందుకు రావాలని, కార్మికుల కోసం తాము సాధించిన అగ్రిమెంట్లతో తాము వస్తామని, వారు చేసిన అగ్రిమెంట్లను తీసుకొని చర్చకు రావాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఘాటైన బహిరంగ సవాల్ విసిరారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గని వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, "మేము కార్మికుల కోసం సాధించిన అగ్రిమెంట్లతో వస్తాం.. మీరు కార్మికుల కోసం చేసిన అగ్రిమెంట్లు తీసుకొని రండి" అని అన్నారు. 11 డివిజన్లలో ఎక్కడైనా, ఏ తేదీనైనా, ఏ ప్రదేశమైనా, ఏ ప్రెస్ క్లబ్‌లోనైనా, ఏ బహిరంగ వేదికపైనైనా బహిరంగ చర్చకు ఏఐటీయూసీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. న్యాయ నిపుణులు, న్యాయవాదులు, ప్రెస్ ప్రతినిధులు, కార్మికులను సాక్షులుగా ఉంచి ఎవరు ఎన్ని అగ్రిమెంట్లు సాధించారు, వాటి వల్ల కార్మికులకు ఎంత ప్రయోజనం కలిగింది, ఎవరు నిజంగా కార్మికుల కోసం పోరాడారు, ఎవరు కేవలం మాటలకే పరిమితమయ్యారు అనే విషయాలను కార్మికుల సమక్షంలోనే తేల్చుకుందామని అన్నారు. "మాటలు కాదు.. అగ్రిమెంట్లు తీసుకొని రండి" అని స్పష్టం చేస్తూ టిబిజికెఎస్, సీఐటీయూ, హెచ్ఎంఎస్, ఐఎన్‌టీయూసీతో పాటు ఏఐటీయూసీని విమర్శిస్తున్న ఇతర కార్మిక సంఘాల నాయకులందరూ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. "మీరు చేసిన అగ్రిమెంట్లు తీసుకొని రండి.. ఏఐటీయూసీ చేసిన అగ్రిమెంట్లను మేము తీసుకొస్తాం. టిబిజికేఎస్ మీ 11 ఏళ్ల పాలన లెక్కలు మీరు చెప్పండి.. రెండేళ్ల ఏఐటీయూసీ పోరాటం, విజయాల లెక్కలు మేము చెబుతాం" అని అన్నారు. సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై యాజమాన్యంతో ఆర్ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగాయని సీతారామయ్య తెలిపారు. ఏఐటీయూసీ నిరంతర ఒత్తిడి, పోరాటం ఫలితంగా గత నెల 27న జరిగిన కీలక చర్చల్లో సింగరేణి యాజమాన్యం కార్మికుల పలు ప్రధాన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి అనేక అంశాలపై అగ్రిమెంట్లకు అంగీకరించిందన్నారు. కార్మికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే ఆర్థిక, ఉద్యోగ, వైద్య, విద్య, సంక్షేమ అంశాలపై ఒప్పందాలు సాధించామని తెలిపారు. ముఖ్యంగా పెర్క్స్‌పై విధించే ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించే విధంగా అగ్రిమెంట్, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం, కార్మికుల వైద్య సమస్యల పరిష్కారానికి ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహణ, 2025--26 వాస్తవ లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్లలో ఉన్న మూడు సంవత్సరాల నిబంధనలో మార్పు, అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లు వంటి కీలక అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఇటీవల ఏఐటీయూసీ నాయకత్వం 24 ఆర్థిక, ఉద్యోగ, వైద్య, విద్య, సంక్షేమ అంశాలపై ఒప్పందాలు కుదిరాయని తెలిపారు .అదేవిధంగా హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, సుమారు 22 సంవత్సరాలుగా మారని మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ కేసుల పరిష్కారం, ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్ సమస్యల పరిష్కారం, మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్లు జారీ వంటి పలు డిమాండ్లపై కూడా అగ్రిమెంట్లు జరిగాయని నాయకులు తెలిపారు. కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన సొంత ఇంటి పథకం అమలుపై ప్రభుత్వంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించి సింగరేణి కార్మికులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసిందన్నారు. గనుల్లో కార్మికుల భద్రతకు అవసరమైన సేఫ్టీ మెటీరియల్‌ను సకాలంలో అందుబాటులో ఉంచడం, మైనింగ్ స్టాఫ్‌కు అర్హతలకు అనుగుణంగా సూటబుల్ సర్ఫేస్ ఉద్యోగాలు కల్పించడం, డిస్మిస్ కార్మికుల పెండింగ్ కేసులను హెచ్‌పీసీ కమిటీ ద్వారా పరిష్కరించడం, ఉద్యోగులకు ఈవెనింగ్ కాలేజీల కోసం ఎన్ఓసీలు, మందమరి--క్యాతన్‌పల్లి పరిధిలో 9 శాతం హెచ్ఆర్ఏ తదితర డిమాండ్లపై కూడా చర్చలు జరిపి అగ్రిమెంట్లు జరిగాయని తెలిపారు. సింగరేణికి కొత్త బొగ్గు గనులు కేటాయించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.



బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి సంస్థ చురుకుగా పాల్గొని, బొగ్గు బ్లాకులు సింగరేణికే దక్కేలా అన్ని విధాలా కృషి చేయాలని కోరారు. కొత్త గనులు రాకపోతే భవిష్యత్తులో సింగరేణి ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, కార్మికుల భవిష్యత్ ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సింగరేణి భవిష్యత్తును కాపాడటం అంటే వేలాది మంది కార్మికుల భవిష్యత్తును కాపాడటమేనని స్పష్టం చేశారు. సంస్థను బలోపేతం చేసేందుకు కొత్త గనులు, కొత్త ఉపాధి అవకాశాలు, కార్మిక సంక్షేమ చర్యలు, సంస్థపై రాజకీయ జోక్యం తగ్గింపు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై కొనసాగించిన నిరంతర ఒత్తిడి ఫలితంగానే పలు కీలక అంశాలపై అంగీకారాలు సాధ్యమయ్యాయని నాయకులు తెలిపారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్, సొంత ఇంటి పథకం, రూ.20 లక్షల ఆర్థిక సహాయం, మెడికల్ బోర్డు, లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్ నిబంధనల మార్పు, ప్రమోషన్లు, వైద్య సదుపాయాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాలపై జరిగిన అగ్రిమెంట్లు కార్మికుల పోరాటానికి లభించిన విజయాలని పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన నివేదికల్లోనూ ఈ అంశాలను ఏఐటీయూసీ కార్మికుల పోరాట ఫలితమన్నారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్.కే. బాజీ సైదా, జాయింట్ సెక్రటరీ రాచర్ల చంద్రమోహన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మీడియా అధికార ప్రతినిధి రాజ్ కుమార్, పిట్ సెక్రటరీ నర్సింగరావు, వైస్ ప్రెసిడెంట్ మల్లేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాయకులు జి.పి. రావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందుతున్న హోం గార్డులకు ఆత్మీయ వీడ్కోలు

**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** పోలీసు శాఖలో సుమారు 35 సంవత్సరాలపాటు హోం గార్డులుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఇద్దరు హోం గార్డులకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచిర్యాల జిల్లా పరిధిలో విధులు నిర్వహించిన జె. రామయ్య (హోం గార్డు నంబర్ 256), గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా పరిధిలో సేవలందించిన పి. సత్తయ్య (హోం గార్డు నంబర్ 249) ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఇద్దరు హోం గార్డులకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి అందించిన సేవలను అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోం గార్డ్స్ ఆర్ఐ పెద్దన్న, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఎం. తిరుపతి, ప్రధాన కార్యదర్శి జె. అంజనేయులు, సంయుక్త కార్యదర్శి కె. ఓంకార్, సంఘం సభ్యులు, హోం గార్డ్స్ ఇన్‌చార్జీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయుడిగా మహమ్మద్ అజ్మత్ అలీకి జిల్లా స్థాయి అవార్డు.

**నిర్మల్ టౌన్ : సెప్టెంబర్ 05 ( ప్రజాజ్యోతి )**విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నిర్మల్‌లోని ప్రముఖ ముహమ్మదీయ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్ మహమ్మద్ అజ్మత్ అలీకి శనివారం నిర్మల్ జిల్లా స్థాయి “బెస్ట్ టీచర్ అవార్డు” లభించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఘన కార్యక్రమంలో ఆయనకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి టి. భోజన్న మహమ్మద్ అజ్మత్ అలీకి బెస్ట్ టీచర్ అవార్డును అందజేసి ఆయన విద్యా సేవలను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌గా విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు నైతిక విలువలను పెంపొందించేందుకు ఆయన ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు బోధన, అభ్యసన ప్రక్రియను మరింత నాణ్యంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉపాధ్యాయులు మహమ్మద్ అజ్మత్ అలీ ఉర్దూ మాధ్యమ విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను అభినందించారు. ఉర్దూ మాధ్యమ విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అజ్మత్ అలీ గత 15 సంవత్సరాలుగా ఉర్దూ మాధ్యమ విద్యార్థుల విద్యాభివృద్ధికి చురుకుగా సేవలందిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తూ విద్యార్థుల విద్యా



సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు వారి నైతిక అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉర్దూ భాష పరిరక్షణ, ప్రోత్సాహం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ఉర్దూ మాధ్యమ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో తనవంతు కృషి చేస్తున్నారు. మహమ్మద్ అజ్మత్ అలీకి జిల్లా స్థాయి “బెస్ట్ టీచర్ అవార్డు” లభించడంపై ముహమ్మదీయ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దొంగల ఆటకు చెక్ పెట్టిన నిర్మల్ పోలీసులు

టైగర్స్ టాస్క్ ఫోర్స్‌తో వరుస దేవాలయ చోరీలు, హౌస్ బ్రేకింగ్ కేసుల ఛేదన

25 దొంగతనాల్లో నిందితుల ప్రమేయం.. 16 కేసుల్లో చోరీ సొత్తు రికవరీ

12 కిలోల వెండి ఆభరణాలు, ఆలయ కిరీటాలు, నగదు, కారు, మెల్టింగ్ మెషిన్లు స్వాధీనం

ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల వెల్లడి

**ఖానాపూర్ సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లాలో దేవాలయాలు, ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను జిల్లా పోలీసులు ప్రత్యేక దర్యాప్తు ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.దొంగతనాల నివారణ కోసం జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ‘టైగర్స్ టాస్క్ ఫోర్స్’ బృందం చోరీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించింది. భైంసా ఏఎస్పీ నిర్మల్ డి ఎస్పీ ఆధ్వర్యంలో సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేరాల వివరాలను విశ్లేషిస్తూ దర్యాప్తు చేపట్టారు. 25 దొంగతనాల్లో నిందితుల ప్రమేయం వరుసగా జరిగిన దేవాలయ చోరీలు, హౌస్ బ్రేకింగ్ కేసులను ఛేదించి నిందితులను గుర్తించడం, అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారుచోరీ సొత్తును రికవరీ చేయడంలో పోలీసు బృందాలు సమన్వయంతో పనిచేశాయని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిలఅన్నారు ఈ కేసుల ఛేదనలో కృషి చేసిన భైంసా ఏ ఎస్ పి సాయి కిరణ్, నిర్మల్ డి ఎస్పీ శ్రీనివాస్, సీఐ లు కృష్ణ, సమ్మయ్య, ఎస్ ఐ లు లింబాద్రి, గణేష్, శ్రీకాంత్,అశోక్, ఎస్.కె. గఫార్, హెడ్ కానిస్టేబుల్ జగన్ సింగ్,లు కానిస్టేబుల్స్ తిరుపతి, సతీష్ తదితర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా




అభినందించారు. దొంగతనాల నియంత్రణకు టైగర్స్ టాస్క్ ఫోర్స్ ద్వారా ప్రత్యేక నిఘా నిరంతరం కొనసాగుతుందనిఅన్నారు దేవాలయాలు, ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లు, దుకాణాలు, దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్ పోలీసులు కోరారు

## పిల్లల ఆరోగ్యానికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి

-- హెల్త్ సుప్రవైజర్ ఏ సంతోష్



**నేరడిగొండ సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి):** మండలంలోని నాగ మల్లయాల అంగన్‌వాడీ కేంద్రంలో యూపీఐ సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏ. సంతోష్, ఏఎన్ఎం భారతి, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆశా కార్యకర్త కౌసల్య పాల్గొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే ఆరోగ్య సేవలు, టీకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 22-ఏ భూముల సమస్యపై ‘చలో ఇందిరాపార్క్’లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

రైతుల భూముల సమస్య కు శాశ్వత పరిష్కారం చూపాలి

ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ బ్యూరో , సెప్టెంబర్ 5: (ప్రజా జ్యోతి )** 22-ఏ భూముల జాబితా నుంచి రైతుల భూములను తొలగించి, వారికి పూర్తిస్థాయి హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ‘చలో ఇందిరాపార్క్’ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ 22-ఏ భూముల సమస్య కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రైతుల భూముల ను 22-ఏ జాబితాలో చేర్చ డం వల్ల రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాలు తదితర అంశాల్లో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి అ ర్హులైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల భూములకు సంపూర్ణ హక్కులు కల్పించే వరకు బీజేపీ తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమస్యను ఇక్కడితో వదిలిపెట్టేది లేదని, ఎల్లుండి జరిగే అసెం బ్లీ సమావేశాల్లో కూడా 22- ఏ భూముల సమస్యపై బీజే పీ ఎమ్మెల్యేలం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, ప్రభు త్వాన్ని ప్రశ్నించి రైతుల తర ఫున బలంగా మా వాణిని వినిపిస్తామని ఎమ్మెల్యే పా యల్ శంకర్ అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు అసెంబ్లీ వేదికగా కూడా త మ పోరాటాన్ని కొనసాగిస్తా మని స్పష్టం చేశారు.రైతుల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# సింగరేణి కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు

**సంఘం ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్**

**మనుబోతుల కొమురయ్య 30వ వర్ధంతి సభలో ఘన నివాళులు**

**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి ):**: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ కార్మిక నాయకుడు, ఏఐటీయూసీ నాయకులు మనుబోతుల కొమురయ్య గారి 30వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య సభకు అధ్యక్షత వహించారు. తొలుత మనుబోతుల కొమురయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించి సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మనుబోతుల కొమురయ్య గారని అన్నారు. సింగరేణి పుట్టినిల్లైన ఇల్లందులో 1928 జూన్ 12న జన్మించిన కొమురయ్య, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారని గుర్తుచేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను స్థాపించి కార్మికులను సంఘటితం చేసి వారి హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత కొమురయ్యకే దక్కుతుందని వక్తలు పేర్కొన్నారు. సింగరేణిలో కొనసాగిన కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా ఆయన నిరంతరం పోరాడారని, కార్మికులకు వారసత్వ ఉద్యోగాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రతి బొగ్గు గని ఉద్యోగుల వేతన ఒప్పందాల్లో సింగరేణి ఉద్యోగుల ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాల ఫలితంగా కార్మికులకు అనేక ప్రయోజనాలు లభించాయని అన్నారు. ముఖ్యంగా ప్రమోషన్ల విషయంలో సింగరేణి ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్ సాధించడంలో కొమురయ్య పోరాటం కీలకమని అన్నారు. కొమురయ్య నాయకత్వంలో జరిగిన పోరాటాల ఫలితంగానే సింగరేణి కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానం, కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా పోరాటం, మహిళా కార్మికులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు వంటి అనేక హక్కులు సాధించబడ్డాయని వక్తలు గుర్తుచేశారు. 1942 నుంచి 1996 వరకు సుమారు 44 సంవత్సరాల పాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని తెలిపారు.సింగరేణి కార్మికుల సమస్యలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర ప్రైవేట్ రంగ కార్మికుల సౌకర్యాలు, హక్కుల సాధన కోసం కూడా కొమురయ్య పోరాడారని వక్తలు తెలిపారు. జాతీయ స్థాయిలో కార్మిక సమస్యలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ కోసం మరువలేని కృషి అన్నారు .ఉద్యోగ విరమణ చేసిన సింగరేణి కార్మికులకు పెన్షన్ సౌకర్యం సాధించడంలో మనుబోతుల కొమురయ్య కృషి మరువలేనిదని వక్తలు పేర్కొన్నారు. కార్మికుడు ఉద్యోగంలో ఉన్నంతకాలమే కాకుండా, పదవీ విరమణ అనంతరం కూడా గౌరవప్రదమైన జీవితం గడపాలనే లక్ష్యంతో ఆయన పోరాడారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సామాజిక భద్రత కోసం ఆయన చేసిన కృషి ఫలితంగా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనం కలిగిందని అన్నారు. కార్మికుల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కొమురయ్య చివరి దశలో కూడా కార్మిక సమస్యలపై పోరాటాన్ని కొనసాగించారని వక్తలు తెలిపారు. జాతీయ స్థాయిలో బొగ్గు గని కార్మికుల సమస్యలు, కార్మికుల హక్కులు, సౌకర్యాల కోసం నిరాహార దీక్షకు పిలుపునిచ్చి, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం



పోరాడుతూనే 1996 సెప్టెంబర్ 5న తుదిశ్వాస విడిచారని సభలో స్మరించుకున్నారు. ఆయన మరణించి 30 సంవత్సరాలు పూర్తయినా సింగరేణి కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల హృదయాల్లో కొమురయ్య చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని వక్తలు కొనియాడారు. ఆయన పోరాటాల ఫలితంగా సాధించిన కార్మిక హక్కులను కాపాడుకోవడంతో పాటు, నేటి తరానికి ఆ పోరాట చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య మాట్లాడుతూ, మనుబోతుల కొమురయ్య పోరాట స్ఫూర్తిని నేటి తరం కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక ఐక్యతను బలోపేతం చేసి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. సీనియర్ విశ్రాంత ఉద్యోగి ఖాజా మొయినోద్దీన్ మాట్లాడుతూ, కొమురయ్యతో తనకున్న అనుబంధాన్ని, కార్మికుల సమస్యల కోసం ఆయన చేసిన పోరాటాలను, తన అనుభవాలను సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య, జాయింట్ సెక్రెటరీ గీస కనకయ్య, రత్నదీప్ రెడ్డి, బోగే వెంకట్ స్వామి, ఎం. రాజనర్సు, కె. లక్ష్మయ్య, కొట్టే మల్లయ్య, ఏ. ప్రభాకర్, ఎం.డి. రఫిక్, అరుల్ కుమార్, ఎస్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలు

**విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ.. సన్మార్గంలో నడిపించాలి**

**ఏఐ యుగంలో ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ టౌన్ : సెప్టెంబర్ 05 ( ప్రజాజ్యోతి )** విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యంతో పాటు జీవితాన్ని ఎదుర్కొనే శక్తిని అందించి, వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలని పేర్కొన్నారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ, మంచి మార్గంలో పయనించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వందేమాతరం, తెలంగాణ రాష్ట్ర గీతాలను ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని అంశాలను చదివి పరీక్షల్లో మార్కులు సాధించడానికే పరిమితం కాకుండా, తాము నేర్చుకున్న విషయాలను వాస్తవ జీవితంలో అన్వయించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో అగ్రస్థానంలో ఉన్న సంస్థల అభివృద్ధికి నైపుణ్యం కలిగిన మానవ వనరులే ప్రధాన కారణమని,




అలాంటి నైపుణ్యాలకు పునాది వేసేది ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శకత్వమేనని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. వివిధ అంశాలు, సబ్జెక్టులపై ఆసక్తి పెరిగేలా పుస్తకాలు, విజ్ఞాన వనరులను చదివేలా వారిని ప్రోత్సహించాలన్నారు. సమాజంపై అవగాహన, శోధనాత్మక దృక్పథం, అభ్యసన సామర్థ్యం, ఆచరణాత్మక ఆలోచనలను విద్యార్థుల్లో పెంపొందించేలా బోధన సాగాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా మంచి మార్గంలో పయనించేలా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రోత్సహిస్తూ, అవసరమైన సమయంలో మార్గనిర్దేశం చేయాలన్నారు విద్య ద్వారా సమాజంలోని చీకట్లను తొలగించి, జ్ఞానదీపాన్ని వెలిగించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఈ ఏడాది గణనీయంగా విద్యార్థుల నమోదు పెరగడం, పరీక్ష ఫలితాల్లో మంచి పురోగతి సాధించడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే అంకితభావంతో పనిచేసి జిల్లాను విద్యారంగంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.



అనంతరం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు సైతం పలువురికి సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, డీఆర్వో రమేష్ రాథోడ్, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పరశురామ్, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, దయానంద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు మనుబోతుల కొమురయ్య

## ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

### ఆర్కే--5 గని వద్ద మనుబోతుల కొమురయ్య 30వ వర్ధంతి సభలో ఘన నివాళులు

**మంచిర్యాల, 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు మనుబోతుల కొమురయ్య అని ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు . సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ కార్మిక నాయకుడు, ఏఐటీయూసీ నాయకులు మనుబోతుల కొమురయ్య గారి 30వ వర్ధంతి సభను ఆర్కే--5 గని వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన కొమురయ్య గారి సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తొలుత కొమురయ్య గారి చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించగా, అనంతరం శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు కూడా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మనుబోతుల కొమురయ్య గారని అన్నారు. సింగరేణి పుట్టినిల్లైన ఇల్లందులో 1928 జూన్ 12న జన్మించిన కొమురయ్య, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారని గుర్తుచేశారు. అనంతరం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను స్థాపించి కార్మికులను సంఘటితం చేసి వారి హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. సింగరేణిలో కొనసాగిన కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా కొమురయ్య నిరంతరం పోరాటం చేశారని, కార్మికులకు వారసత్వ ఉద్యోగాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారని వక్తలు పేర్కొన్నారు. బొగ్గు గని ఉద్యోగుల వేతన ఒప్పందాల్లో సింగరేణి ఉద్యోగుల ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాల ఫలితంగా కార్మికులకు అనేక ప్రయోజనాలు లభించాయని తెలిపారు. ముఖ్యంగా ప్రమోషన్ల విషయంలో సింగరేణి ఉద్యోగులకు ఒక అదనపు ఇంక్రిమెంట్ సాధించడంలో ఆయన పోరాటం కీలకమైందని అన్నారు. కొమురయ్య నాయకత్వంలో సాగిన ఉద్యమాల ఫలితంగానే సింగరేణి కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానం, కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా పోరాటం, మహిళా కార్మికులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు వంటి అనేక హక్కులు సాధించబడ్డాయని వక్తలు తెలిపారు. 1942 నుంచి 1996 వరకు సుమారు 44 సంవత్సరాల పాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. సింగరేణి కార్మికుల సమస్యలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర ప్రైవేట్ రంగ కార్మికుల సౌకర్యాలు, హక్కుల సాధన కోసం కూడా కొమురయ్య పోరాడారని వక్తలు తెలిపారు. జాతీయ స్థాయిలో కార్మిక సమస్యలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన సింగరేణి కార్మికులకు పెన్షన్ సౌకర్యం సాధించడంలో మనుబోతుల కొమురయ్య కృషి మరువలేనిదని పేర్కొన్నారు. కార్మికుడు ఉద్యోగంలో ఉన్నంతకాలమే కాకుండా పదవీ విరమణ అనంతరం కూడా గౌరవప్రదమైన జీవితం గడపాలనే లక్ష్యంతో ఆయన పోరాడారని, రిటైర్డ్ ఉద్యోగుల



సామాజిక భద్రత కోసం చేసిన కృషి ఫలితంగా వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనం కలిగిందని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కొమురయ్య చివరి దశలో కూడా కార్మిక సమస్యలపై పోరాటాన్ని కొనసాగించారని నాయకులు గుర్తుచేశారు. జాతీయ స్థాయిలో బొగ్గు గని కార్మికుల సమస్యలు, కార్మికుల హక్కులు, సౌకర్యాల కోసం నిరాహార దీక్షకు పిలుపునిచ్చి, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పోరాడుతూనే 1996 సెప్టెంబర్ 5న తుదిశ్వాస విడిచారని సభలో స్మరించుకున్నారు. ఆయన మరణించి 30 సంవత్సరాలు పూర్తయినా సింగరేణి కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల హృదయాల్లో కొమురయ్య చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని వక్తలు కొనియాడారు. ఆయన పోరాటాల ఫలితంగా సాధించిన కార్మిక హక్కులను కాపాడుకోవడంతో పాటు, నేటి తరానికి ఆయన పోరాట చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ సెక్రెటరీ ఎస్.కే. బాజీ సైదా, జాయింట్ సెక్రెటరీ రాచర్ల చంద్రమోహన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మీడియా అధికార ప్రతినిధి రాజ్ కుమార్, పిట్ సెక్రెటరీ నర్సింగరావు, వైస్ ప్రెసిడెంట్ మల్లేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాయకులు జి.పి. రావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ల పై విచారణ పేరుతో కాలయాపన చేయకుండా అనర్హులను వెంటనే తొలగించాలి

**ఖానాపూర్ సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి)** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని కొమురం భీమ్ చౌరస్తాలో ఉన్న డబల్ బెడ్ రూమ్ లపై పూర్తిస్థాయిలో సమగ్రంగా విచారణ జరిపి అనరులను తొలగించాలని వామపక్ష పార్టీలు సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఎంసీపీఐయు బీసీపీ డబుల్ బెడ్ రూమ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ ధర్నా నిర్వహించి తాసిల్దార్ సుజాత కి మునిసిపల్ కార్యాలయంలోవినతిపత్రలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్, ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న లు మాట్లాడుతూ పట్టణ శివారులో కొమురం భీం చౌరస్తాలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లో అనేక అవినీతి జరిగిందని అనేక పోరాటాలు జరిగిన క్రమంలో అనర్హుల జాబితా కొంత పెట్టినప్పటికీ అవి పూర్తిస్థాయిలో లేవు. విచారణ పేరు తోటి సంవత్సరాలు గడుస్తున్నాయి అధికారులు మారుతున్నారు ప్రభుత్వాలు మారుతున్నాయి అయినప్పటికీ పేదలపై కనికరం లేదు ఈ ప్రభుత్వాలకు. ప్రశ్నించినప్పుడే సమస్య పరిష్కారం చేస్తామని హామీలు ఇచ్చి మర్చిపోతున్నారు కానీ ఇక్కడేసిన గొంగడి అక్కడే అన్నచందంగా డబల్ బెడ్ రూమ్ ల పరిస్థితి ఉంది. సర్వేల పేరిట కాలయాపన చేయకుండా అనరులను తొలగించడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు పడతాయని ప్రశ్నిస్తున్నాశీ. ఇప్పటికైనా నిజాయితీగా చిత్తశుద్ధితో సమగ్రంగా విచారణ జరిపి అనరులను తొలగించాలని, అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు కేటాయించాలని, అరువులను తొలగించిన తర్వాతనే ఆన్లైన్ లో నమోదు చేసి నిజమైన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు లేనిపక్షంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ సాధన కమిటీ కన్వీనర్ తోటరాద,ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు ఆడే గణేష్,



అఖిలభారత మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పి స్వరూప, డబల్ బెడ్ రూమ్ సాధన కమిటీ నాయకులు, షేక్ గౌస్ షేక్, ఎస్ కె జమీర్ జావీ ద్, జాఫర్,మధు, మాజీత్, కల్పన లక్ష్మి గంగోత్రి పద్మ సునీత శరీన షాదుల్లాలి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి జన్మదిన వేడుకలు



**నేరడిగొండ, సెప్టెంబర్ 5 (ప్రజాజ్యోతి):** బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై బద్దం పోతారెడ్డితో కేక్ కట్ చేయించారు. అనంతరం శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బద్దం పోతారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. యువతను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఎస్ఐఆర్ వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని కోరారు. యువత అంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బద్దం పోతారెడ్డి మాట్లాడుతూ.. తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి యువతను ఏకం చేస్తూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్ బ్లాక్ ఆత్మ కమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్, గొర్ల రాజు యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్, రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు కుర్మ మహేందర్, ఆత్మ కమిటీ చైర్మన్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ శ్రీకర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ రషీద్, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని బద్దం పోతారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉట్నూర్ లో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల విజయోత్సవ ర్యాలీ






## పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

## 1000 రోజుల్లో వెయ్యి కోట్లు తీసుకొచ్చిన ఘనత ఖానా పూర్ ఎమ్మెల్యేది ఉట్నూర్ కాంగ్రెస్ నాయకులు

## మొద్దు నిద్రలో ఉన్న కేసీఆర్ రాజీనామా చెయ్యాలి కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్

**ఉట్నూర్, సెప్టెంబర్ 5: (ప్రజా జ్యోతి )** కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భం గా నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పటేల్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి బారి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉట్నూర్ ఎమ్మె ల్యే క్యాంప్ కార్యాలయంలో నుండి ప్రారంభమై ఐబీ చౌర స్తా,అంగడి బజార్, పాత బస్టాండ్ మీదుగా ఐటీడీఏ వ యా అంబేద్కర్ కూడలికి చేరుకుంది. ఈ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ జిందాబాద్,బొజ్జన్న నాయకత్వం వర్ధిల్లాలి, ప్రజల పట్ల బాధ్యత లేని ప్రతి పక్ష నాయకుడు కేసీ ఆర్ రాజీనామా చెయ్యాల నే నినాదాలతో ఉట్నూర్ ప్రధాన కూడళ్లు కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలతో హో రెత్తాయ్. అనంతరం కార్నర్ మీటింగ్ లో కాంగ్రెస్ నాయ కులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అనేక అబివృ ద్ధి, సంక్షేమ పథకాలు అం దించాం అని,2 లక్షల రైతు రుణమాఫీ,200 యూనిట్ల ఉచిత కరెంట్,మహిళలకి ఉచిత బస్సు,మహిళా శక్తి ద్వారా ఇందిరమ్మ క్యాంటీ న్లు, పెట్రోల్ బంకులు,ఆర్టీసీ బస్సులు,విద్యార్థులకుని యోజకవర్గంలో 200 వంద ల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఎమ్మె ల్యే వెడ్మ బొజ్జు ప్రత్యేక చొర వతో ఏర్పాటు చేసుకున్నాం అని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఆదివాసీ, గిరిజన బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగు తుంది అని,ఈ వెయ్యి రోజు ల్లో గత 10 ఏండ్లలో ప్రతి ప క్ష నాయకుడు కేసీఆర్ ఒక్క రోజు అసెంబ్లీ కి రాకుండా ప్రజల పట్ల రాష్ట్రం పైన బా ధ్యత లేకుండ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పైన విమర్శ లు చేయడం సరికాదని కాం గ్రెస్ నాయకులు అన్నారు. వెంటనే కేసీఆర్ రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశా రు. పదేండ్లలో బి ఆర్ ఎస్ అధికారంలో ఉండి దళిత ముఖ్యమంత్రిని చేస్తాం అని మాట తప్పారు,దళితులకు మూడెకరాల భూమి ఇవ్వ లేదు, విద్యార్థులకు ఫీ రీయ బర్స్మెంట్ చేయలేదు, నిరుద్యోగ భృతి ఇస్తాం అని 10 సంవత్సరాలు ప్రజలను మోసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య, జన రల్ సెక్రటరీ ఇక్బాల్,ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, మార్సుకోల తిరుపతి, ఉ ట్నూర్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ నిసార్, లాజర్ యూత్ కాంగ్రెస్ నాయకులు అరకిల్ల పరమేశ్వర్,ఎస్సీ సె ల్ మండల అధ్యక్షుడు మ హేందర్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఆత్రం తిరుపతి, ఉపసర్పంచ్ కోరం అధ్యక్షు డు కొద్దు పటేల్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, అ న్సారీ, అజీమ్, దేవానం దం, కలీమ్, షెరీఫ్, గోడిపల్లి భీమన్న, ఫహీమ్ తదిత రులు పాల్గొన్నారు.

# నలుగురికి ఉత్తమ ఉపాధ్యాయ, లక్ష్మీదేవి అవార్డులు



**బాసర సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి)**బాసర:ఉపా ధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాసర ప్రాంతానికి చెందిన నలుగురు విద్యావేత్తలు, సామాజిక సేవకులకు ఉత్తమ ఉపాధ్యాయ, లక్ష్మీదేవి అవార్డులు లభించాయి. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం మాతృదేవోభవ సత్సంగ్, సావిత్రీబాయి మహిళా సంక్షేమ సొసైటీ, జేపీ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర డీవీఎస్ సొసైటీ అధ్యక్షుడు అట్టోలి చంద్రశేఖర్ కార్యదర్శి సయ్యద్ ఖైసర్, కోశాధికారి ఎస్.కె. అలీ, ఐటీడీఏ ఉట్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యా యులు, సామాజిక కార్యకర్తలు పి. సురేశ్, ఎం. రాములు లను సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ, లక్ష్మీదేవి అవార్డులు అందజేశారు. విద్యారంగంలో, సామాజిక సేవలో వారు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డులు అందుకున్న వారిని పలువురు విద్యావేత్తలు, డీవీఎస్ సొసైటీ సభ్యులు, స్థానికులు అభినందించారు.

# జిల్లాలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## ఘణంగా గురుపు జోత్సవం



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 5, (ప్రజా జ్యోతి)** జిల్లాలోత విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడాలని జిల్లా కలెక్టర్ రాజర్శి షా అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. జి ల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో శనివారం గురుపూజోత్సవ వేడుక లను విద్యాశాఖ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై, సర్వేపల్లి రాధాకృష్ణ న్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాలోని ఉత్తమ పురస్కారాలకు ఎంపి కైన ఉపాధ్యాయులను ఘ నంగా సత్కరించి అభినం దించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో ప్రస్తుత విద్యాసంవత్స రంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య ను 100కి చేరేలా ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు బోధన చేయా లని, ఏది మంచో, చెడో విడ మర్చి చెప్పాలని సూచించా రు. గ్రామాల్లో బెల్టు దుకాణా లు లేకుండా చూడటంలో విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యవంతం చేయడంలో యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్ద డంలో, ఉన్నత స్థాయికి ఎ దగడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంచేలా విద్యార్థు లకు బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ రాజేశ్వ ర్, జిల్లా విద్యాశాఖ అధికా రిణి మాధవి, గ్రంథాలయ చై ర్మన్ నర్సయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ కాంత్ రెడ్డి, జిల్లా అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉయికె శిరీష హత్య ఘటన దోషిని వెంటనే ఎన్ కౌంటర్ చేయాలి

**ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి డిమాండ్**

**గుడిహత్నూర్ లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ**




**గుడి హత్నూర్, సెప్టంబర్ 5, (ప్రజా జ్యోతి )**తుక్కుగూడ ప్రైమ్ కేర్ హా స్పిటల్ లో నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఆదివాసీ ఆడ బిడ్డ ఉయికె శిరీషను అత్యాచారం చేసి అత్యంత దారుణంగా, కిరాతకం గా హింసించి హత్య చేసిన దుండగుడిని వెంటనే ఎన్ కౌంటర్ చే యాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సేన, ఆదివాసీ మ హిళా సేన ఆదిలాబాద్ జి ల్లా కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గుడి హ త్నూర్ లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాల జవహర్ నగర్ నుండి గుడి హత్నూర్ బస్ స్టాండ్ వరకు వందలాది మంది విద్యార్థులు, యువకులు, మహిళలు కొవ్వొత్తులతో నిరసన తెలిపా రు. "ఉయికె శిరీ షకు న్యాయం చేయాలి, దోషులను ఉరితీయాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి మాట్లాడుతూ శిరీష హత్య ఆదివాసీ సమాజానికే అవమానమని, ఇది కేవలం ఒక హత్య కాదు ఆదివాసీ ఆడబిడ్డల ఆత్మగౌరవం పై దాడి అని అన్నారు. ప్రైమ్ కేర్ హాస్పి టల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని ఆరోపించారు.

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన అంశాలు**

నిందితుడు హాసం ను వెంటనే ఎన్ కౌంటర్ చేయాలి. ప్రైమ్ కేర్ హాస్పిటల్ యా జమాన్యంపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చే యాలి. హాస్పిటల్ లైసెన్స్ రద్దు చేసి వెంటనే సీజ్ చే యాలి. బాధిత కుటుంబా నికి కోటి రూపాయల పరి హారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి, జిల్లా అధ్యక్షులు రాయిసిడాం జంగుపటేల్, యువ నాయకుడు ఉ ర్వేత రోహిత్, జిల్లా కోశా ధి కారి ఉయిక శ్యాంరావు, విద్యార్థి సేన జిల్లా అధ్యక్షులు కోట్నక గణేష్, కార్యదర్శి కుంరం చత్రుఘన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపా ధ్యక్షులు మేస్రం మోహన్, గుడిహత్నూర్ పట్టణ అధ్య క్షులు తోడషం లక్ష్మణ్, కుం రం విష్ణు, నైతం గణేష్ మహిళా సేన నాయకురాళ్లు తోడషం ధనలక్ష్మి, గేడం సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం

## ఉపకార వేతనాలూ వెంటనే విడుదల చేయాలి

## విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దు: పీడీఎస్‌యూ



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 5 ప్రజా జ్యోతి** విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రాయితీ బకాయిలు, ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) కొమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జానకపూర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రాయితీ, ఉపకార వేతనాల బకాయిలు సుమారు రూ.12 వేల కోట్లకు చేరుకున్నాయని తిరుపతి తెలిపారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యాభ్యాసం పూర్తయిన అనంతరం ధ్రువపత్రాల కోసం కళాశాలలకు వెళ్లిన విద్యార్థులను బకాయి ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని పేర్కొన్నారు.

**హామీలు అమలు చేయాలి**

అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రాయితీని సకాలంలో చెల్లిస్తా మని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. మూడేళ్లు గడిచినా బకాయిలను పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని తిరుపతి విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై సంఘాలు అనేకసార్లు ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమ న్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

**విద్యారంగాన్ని కాపాడాలి**

ప్రత్యేక పథకం కింద చదువుతున్న విద్యార్థులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ చేసే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని కోరారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు, కార్పొరేట్ విద్యాసంస్థల విస్తరణను అడ్డుకోవాలని అన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తిరుపతి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సమీర్, ప్రధాన కార్యదర్శి జగజంపుల తరుణ్, ఉపాధ్యక్షుడు శివశంకర్, సహాయ కార్యదర్శి బౌరే వసంత్, నాయకులు ప్రణయ్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బూర్తుల భారతికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం



**సోనాల, సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి):**విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకుగాను సోనాల మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు బూర్తుల భారతి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గత కొన్నేళ్లుగా బోధనా రంగంలో వినూత్న పద్ధతులు అవలంబి స్తూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు గాను ఆమెకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా బూర్తుల భారతి మాట్లాడుతూ.. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు. అవార్డు గ్రహీత భారతిని పాఠశాల సహచర ఉపాధ్యాయులు, గ్రామస్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## పోలీస్ ఉద్యోగాల కోసం 60 రోజుల ఉచిత ప్రత్యేక శిక్షణ

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 4, (ప్రజా జ్యోతి )**ఆదిలాబాద్ జిల్లాలో కానిస్టే బుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగాలకు సిద్ధ మవుతున్న అభ్యర్థుల కోసం బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యం లో 60 రోజుల ప్ర త్యేక ఉచిత శిక్షణ బ్యాచ్ ను ఏర్పాటు చేస్తున్న ట్లు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలి పారు. మొత్తం 200 మంది అభ్యర్థులకు, 100 మందికా నిస్టేబు ల్, 100 మంది ఎస్ ఐ అభ్యర్థులకు శిక్షణ అం దించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 05 నుంచి 11వ తేదీ వరకు బీసీ స్టడీ సర్కి ల్, ఆది లాబాద్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయం త్రం5 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు

**ఎంపిక విధానం**

బీసీలు 25 శాతం, ఎస్సీలు 25 శాతం,ఎస్టీలు 25 శాతం, ఈబీసీ/ఈ డబ్ల్యూఎస్/అనాథలు 25 శాతం. అభ్యర్థులు రూ.3 లక్షల ఆదాయ పరిమితికి సంబంధించిన ఇన్‌కమ్ సర్టి ఫికెట్‌తో పాటు కుల ధ్రువీ కరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసిన పత్రం సమర్పించాలి. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్‌మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. దరఖా స్తుల ప్రారంభం 5- నుంచిదరఖా స్తుల చివరి తేదీ 11 వరకు,మెరిట్ జాబితా: 16 సెప్టెంబర్ వరకు. సర్టిఫికెట్ వెరిఫికేషన్: 17 నుంచి 18 వరకు.- శిక్షణ 19 న ప్రారంభం ఆయన విరించారు. శిక్షణలో భాగంగా అభ్యర్థు లకు ఉచిత పుస్తకాలు అందించడంతో పాటు, ప్రతి రో జూ నిపుణులైన అధ్యాపకులతో నాలుగు తరగతులు నిర్వహించనున్నట్లు తె లిపారు. వారానికి ఒకసారి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వ హించి అభ్యర్థుల ప్రతిభను అంచనా వేయనున్నట్లు పే ర్కొన్నారు. శిక్షణ తరగతు లు బీసీ స్టడీ సర్కిల్, ఆది లాబాద్‌లో కొనసాగుతా యని తెలిపారు. మరిన్ని వివరాలకు బీసీ స్టడీ సర్కిల్, ఎస్సీ స్టడీ సర్కిల్, ఆదిలా బాద్ ఆయన తెలిపారు.ఫోన్: 08732-221280, 9949684959, 9494149416 సంప్రదిం చాలని అన్నారు.

## ప్రజా పాలన సంబరాల్లో పా ల్గొన్న మాజీ ఎంపీ సోయం బాపూరావు

**వేలాది బైక్ లతో భారీ ర్యాలీ**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 5, (ప్రజా జ్యోతి )** అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాల యం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కి ముఖ్యఅతిథిగా మాజీ ఎం పీ మాజీ ఎమ్మెల్యే రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షు లు సోయం బాపూరావు హాజరయ్యారు. ఈ ర్యాలీ అనంతరం అంబేద్కర్ చౌర స్తాలో ప్రజా పాలన సంబరా లను ఘనంగా నిర్వహిం చా రు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి, ప్రతి పక్ష నాయకుడు కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయ కత్వంలో అనేక సంక్షేమ ప థకాలను అమలు చేస్తూ ప్ర జలకు మేలు చేస్తోందన్నారు. నిరుద్యోగులకు 70వేల కు పైగా ఉద్యోగాలు, అర్హు లైన ప్రతి ఒక్కరి రేషన్ కార్డు లు, మహిళలకు ఉచిత బ స్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రెండు లక్షల ఏక కాలంలో రుణ మాఫీ, నిరుపేదలకు ఇంది రమ్మ ఇండ్లు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అంది స్తుందన్నారు. కానీ బీజేపీ, బి ఆర్ ఎస్, నాయకులు అ భివృద్ధి పథకాలను చూసి ఓర్వలేక ప్రజా ప్రభుత్వం పై మాట్లాడడం సిగ్గు చెటన్నా రు. మాజీ మంత్రి జోగు రా మన్న, స్థానిక బీజేపీ ఎమ్మె ల్యే పాయల్ శంకర్ గ్రామాల్లో సైతం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకో సా రి రేవంత్ రెడ్డి ముఖ్యమం త్రి అవుతారని, అలాగే రా హుల్ గాంధీ ప్రధాని అవ్వ డం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్య క్షుడు నరేష్ జాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాహిద్ ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మ న్ శ్రీకాంత్ రెడ్డి, సంజీవ రెడ్డి, అడి భోజరెడ్డి, మల్లెపూ ల నరసయ్య, ఆడే గజేంద ర్, గంద్రత్ సుజాత, కిజార్ పాషా, గిమ్మ సంతోష్ రావు తదితర కాంగ్రెస్ పార్టీ నా యకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొమురయ్య సేవలు చిరస్మరణీయం



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** ఆర్కేపీ సీఎచ్‌పీలో పిట్ కార్యదర్శి హరి రామకృష్ణ ఆధ్వర్యంలో మనుబోతుల కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ హాజరై కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింగరేణి కార్మికుల హక్కులు, పెన్షన్ సాధనలో కొమురయ్య కీలక పాత్ర పోషించారని అక్బర్ అలీ అన్నారు. ఈ కార్యక్రమంలో సిరాజుద్దీన్, మండల శ్రీనివాస్, సీతారామారావు, కృష్ణస్వామి, శ్రీధర్‌రావు, డొక్కు శ్రీనివాస్, ఆవుల మల్లమ్మ, వైష్ణవి, రజిత, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్**



**బజార్హత్నూర్ సెప్టెంబర్ 05,ఆ(ప్రజా జ్యోతి):** బజారత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గిర్నూర్ యాదవ సంఘ భవనంలో నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొని శ్రీ కృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతులు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ కృష్ణ భగవానుడిని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, గిర్నూర్ సర్పంచ్ ప్రియాంక భీమేష్, బజార్ హత్నూర్ మండల అధ్యక్షుడు కళ్ళెం విఠల్, టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మెత నర్సయ్య, మండల ఉపాధ్యక్షులు రాథోడ్ రమేష్, మల్లెపూల నారాయణ, జాదవ్ గణేష్, ప్రధాన కార్యదర్శి గొల్లనాగు రమేష్, సురేష్ రెడ్డి, బుక రాములు, యండి సద్దాం, విలాస్, మౌలానా, యాదవ సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో పేరు ఉన్న ఓటర్లకు హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేసి అవసరమైన ధృవపత్రాలను స్వీకరించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు నోటీసులను పంపిణీ చేసే సమయంలో సంబంధిత ఓటర్లకు ధృవపత్రాలు సమర్పించాలని తెలియజేయాలని సూచించారు. సహాయ ఎన్నికల అధికారుల లాగిన్ లో గల వివరాలను త్వరగా పరిష్కరించాలని, ఈ నెల 5, 6, 12, 13 తేదీలలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ప్రచార దినోత్సవాలు నిర్వహించి ఫారం 6, 7, 8 లు స్వీకరించాలని, నిర్ణీత గడువులోగా హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గం



**ఖానాపూర్ సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి )**నిర్మల్ జిల్లా పోలీస్ అధికారుల సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ను శనివారం మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందిస్తూ, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులపై సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, సమన్వయం, సేవాభావాన్ని మరింత బలోపేతం చేయడంలో పోలీస్ అధికారుల సంఘం కీలక పాత్ర పోషించాలని సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోలీస్ శాఖ అభివృద్ధి అధికారుల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఆర్ఐ అమిత్ రామ్, అలాగే నిర్మల్ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు ప్రత్యేక అవ సరాలు గల విద్యార్థుల ఎ క్స్‌పోజర్ విజిట్

**జెండా ఊపి బస్సులను ప్రా రంభించిన కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 5, (ప్రజా జ్యోతి )**ప్రభుత్వ పాఠశాలల్లో చదు వుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ఆత్మ స్థైర్యం పెంపొందించేందుకు పీఎం శ్రీ సమగ్ర శిక్ష ఆధ్వ ర్యంలో చేపట్టిన ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమం శనివారం జిల్లాలో ఘనంగా ప్రారంభ మైంది. జిల్లా కేంద్రంలోని క లెక్టరేట్ ఎదుట 80 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, ఐఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులతో కూడిన బస్సు సర్వీసు లను జిల్లా కలెక్టర్ రాజర్షిషా జెండా ఊపి ప్రారంభించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఎక్స్‌పోజర్ విజిట్ అవ కాశాన్ని ఒక సువర్ణ అవకా శంగా భావించి, పర్యటనలో కొత్త విషయాలను నేర్చుకో వాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు ఇలాంటి విహార, విజ్ఞాన యాత్రలు వి ద్యార్థుల సర్వతోము ఖాభి వృద్ధికి ఎంతగానో దోహద పడతాయన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సద్వినియోగాన్ని విద్యార్థులు ఆనందంగా గడపాలని సూచించారు. పర్యటన పూ ర్తిస్థాయిలో సురక్షితంగా సాగేలా చూసే బాధ్యత వెంట వెళ్తున్న ఐఆర్పీలు, ప్రత్యేక ఉపాధ్యాయులపై ఉందని, అందరూ క్షేమంగా తిరుగు వచ్చి అనుభవాలను పంచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి మాధవి, జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, వివిధ మండలాల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 20 మంది ఐఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపా ధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్‌లో ఆర్‌కే-5 గ్రూప్ విజయం

**రన్నరప్‌గా ఎస్ఆర్‌పీ గ్రూప్..**

**పోటీలను పర్యవేక్షించిన డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ నిర్వాహకులు**



**మంచిర్యాల , 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రగతి స్టేడియం వేదికగా శుక్రవారం ప్రారంభమైన శ్రీరాంపూర్ ఏరియా అంతర్ విభాగాల క్రీడా పోటీల్లో భాగంగా రెండో రోజు బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. నాలుగు జట్లు పోటాపోటీగా తలపడగా, తుదిపోరులో ఆర్‌కే-5 గ్రూప్ విజేతగా నిలిచింది. ఎస్ఆర్‌పీ గ్రూప్ రన్నరప్‌గా నిలిచింది. మొదటి మ్యాచ్‌లో ఆర్‌కే-5 గ్రూప్, ఆర్‌కే-7 గ్రూప్ జట్లు తలపడగా ఆర్‌కే-5 జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. రెండో మ్యాచ్‌లో అదర్స్ జట్టు, ఎస్ఆర్‌పీ గ్రూప్ మధ్య పోటీ జరగగా ఎస్ఆర్‌పీ గ్రూప్ విజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. అనంతరం ఆర్‌కే-5 గ్రూప్, ఎస్ఆర్‌పీ గ్రూప్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. చివరకు ఆర్‌కే-5 గ్రూప్ జట్టు విజయం సాధించి బాస్కెట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచింది. ఎస్ఆర్‌పీ గ్రూప్ రన్నరప్ స్థానాన్ని దక్కించుకుంది. వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్ సారథ్యంలో పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్, జనరల్ కెప్టెన్ సకినాల నర్సయ్య పర్యవేక్షణలో బాస్కెట్‌బాల్ పోటీలు విజయవంతంగా జరిగాయి. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

## దండేపల్లిలో కొమురం భీం విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



**దండేపల్లి, సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి):**దండేపల్లి మండల కేంద్రంలో త్వరలో ఏర్పాటు చేయనున్న ఆ దివంగత ఆదివాసీ పోరాట యోధుడు, అమరవీరుడు కొమురం భీం విగ్రహ నిర్మాణ పనులకు శనివారం వైభవంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి,ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి ముఖ్య అతిథిగా హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివాసీల హక్కుల కోసం, 'జల్-జంగల్-జమీన్' నినాదంతో పోరాడిన కొమురం భీం ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , సర్పంచ్ అజ్మీర రాజేశ్వర్ నాయక్, ఉప సర్పంచ్ సిరికొండ నవీన్, కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సృజన్, ఆకుల దుర్గ ప్రసాద్, కొంగల నవీన్లతో పాటు ఆదివాసీ నాయకులు పెంద్రం శ్రీనివాస్, రాజు, కుడిమెత సోము తదితరులు పాల్గొన్నారు.

# గురువే భవితకు దిక్సూచి!

**చైతన్యలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**

**గురువుల సేవలకు ఘన సన్మానం..**

**ఆనందోత్సాహాలతో కళకళలాడిన పాఠశాల ప్రాంగణం**



**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 5, ప్రజా జ్యోతి:**"గురువు చూపిన మార్గమే విద్యార్థి భవిష్యత్తుకు వెలుగునిచ్చే దారి" అనే స్ఫూర్తిదాయక సందేశంతో శ్రీచైతన్య స్కూల్ మందమర్రి బ్రాంచ్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రమేష్, ఏజీఎం అరవింద్ రెడ్డి, డైరెక్టర్ మల్లంపల్లి శ్రీధర్, శ్రీవిద్య మేడమ్, కోఆర్డినేటర్ నాగరాజు, జైశ్రీ మేడమ్, రోజా మేడమ్, డీన్ రవితేజ, ఇంచార్జ్ సునీత మేడమ్, తిరుమల మేడమ్తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గురువుల సేవలకు ఘన సన్మానం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులు పోషించే పాత్ర ఎంతో గొప్పదని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలను విద్యార్థులకు బోధిస్తూ వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో గురువుల పాత్ర అనిర్వచనీయమని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తే గురువుల లక్ష్యం విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడమే కాకుండా వారి ప్రతిభను గుర్తించి, సరైన మార్గంలో నడిపిస్తూ ఉన్నత శిఖరాలకు చేర్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వక్తలు అన్నారు. గురువుల మార్గ దర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో పాఠశాల ప్రాంగణం సందడి వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు."గురువు ఒక వ్యక్తిని మాత్రమే కాదు... ఒక తరాన్ని తీర్చిదిద్దే మహోన్నత శక్తి." మందమర్రి శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం, పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు.

# ఉపాధ్యాయులే బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తారు



**శ్రీరాంపూర్ సింగరేణి హైస్కూల్‌లో**

**ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**మంచిర్యాల , 5,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే, వారికి విద్యాబుద్ధులు నేర్పి బంగారు భవిష్యత్తును అందించేది ఉపాధ్యాయులేనని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి హైస్కూల్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మునిగంటి శ్రీనివాస్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్య ద్వారానే చిన్నారులు ఉన్నత స్థాయికి ఎదిగి దేశ అభివృద్ధికి బాటలు వేయగలరని అన్నారు. విద్యావ్యవస్థ పటిష్టతకు విశేష కృషి చేసిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించి దేశానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదని పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత కరస్పాండెంట్ డీవైపీఎం క్రాంతికుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌తో పాటు సింగరేణి హైస్కూల్ ఉపాధ్యాయులను జీఎం మునిగంటి శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు అందించిన సందేశాలు ఆకట్టుకున్నాయి. శ్రీరాంపూర్ సింగరేణి హైస్కూల్ గత ఏడాది పదో తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి సింగరేణి వ్యాప్తంగా ముందువరుసలో నిలిచి శ్రీరాంపూర్ ఏరియాకు గర్వకారణంగా నిలిచిందని జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఈ ఘనతకు పాఠశాలలోని నిష్ణాతులైన అధ్యాపకుల నిరంతర కృషి, విద్యార్థుల పట్టుదలే ప్రధాన కారణమని ఆయన కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న విలువైన బోధన, మార్గదర్శకత్వం అభినందనీయమన్నారు. ఈ ఏడాది కూడా పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలను జీఎం మునిగంటి శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డీవైపీఎం క్రాంతికుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, సింగరేణి హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఘనంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది.

# చెన్నూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

## అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి

## అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు

## మంత్రి వివేక్ వెంకటస్వామి





**మంచిర్యాల, 5, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూరు క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చెన్నూరు మున్సిపాలిటీలో సుమారు రూ.75 లక్షల నిధులతో మూడు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. చెన్నూరు పట్టణంలో గతంలో రోడ్లు, డ్రైనేజీల పరిస్థితి అధ్వాన్నంగా ఉండేదని మంత్రి తెలిపారు. తాను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యత ఇచ్చి చేపట్టినట్లు చెప్పారు. గతంలో చెన్నూరులో అభివృద్ధి పనులకు పెద్దగా నిధులు మంజూరు చేయలేదని, కేవలం సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనులు మాత్రమే చేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కేవలం శంకుస్థాపనలు చేసి కొబ్బరికాయలు కొట్టడం తప్ప పనులను పూర్తి చేయలేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత తాను ఎమ్మెల్యేగా చెన్నూరు నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తున్నానని వివేక్ వెంకటస్వామి తెలిపారు. పట్టణంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులకు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నారని చెప్పారు. రోడ్డు వెడల్పు పనుల్లో ఉపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా షాపులు నిర్మించి ఇచ్చే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో మంచి నీటి పథకంలో భాగంగా రూ.30 కోట్ల నిధులతో పనులు కొనసాగుతున్నాయని, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. చెన్నూరు పట్టణాన్ని ఒక మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.70 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు .గోదావరికి వెళ్లేందుకు 10వ వార్డులో రోడ్డు వెడల్పు పనులకు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలోని పోచమ్మ ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశామని చెప్పారు. చెన్నూరును టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.17 కోట్ల నిధులతో ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. జోడువాగుల వద్ద అభివృద్ధి పనుల కోసం ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫాలోఅప్ చేసి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించారని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. చెన్నూరు డిపో ఏర్పాటు పట్టణ ప్రజల చిరకాల వాంఛ అని మంత్రి అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా డిపో పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత ఆ పనులను తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నానని, త్వరలోనే చెన్నూరు డిపో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరులో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి భవనాన్ని ఈ నెలలో ప్రారంభించనున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. ఇప్పటికే 23 మంది వైద్యులు రావడం జరిగిందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు చెన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. ఇటీవల బీజేపీ నాయకులు తప్పుడు ఆందోళనలు చేశారని విమర్శించారు. "ఇక్కడ ప్రజాపాలన జరుగుతుంది.. బుల్డోజర్ పాలన బీజేపీ చేస్తుంది" అని అన్నారు. బీజేపీ నాయకులు కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. చెన్నూరు నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వైద్యం, పర్యాటకం, దేవాలయాల అభివృద్ధి, రోడ్డు వెడల్పు తదితర రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంతో పాటు కొత్తగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు తీసుకొస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి చెన్నూరు పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చెన్నూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .

# విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 5, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** విద్యా పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రతిష్ఠాత్మక విశిష్ట ప్రతిభా పురస్కారం--2026 అందుకున్నారు. రాష్ట్రంలోని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. 2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. 2025--26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 43 వేల 72 మంది విద్యార్థులు ఉండగా, 2026--27 విద్యా సంవత్సరంలో ఈ సంఖ్య 45 వేల 626కు పెరిగింది. దీంతో గత విద్యా సంవత్సరంతో పోలిస్తే అదనంగా 2 వేల 554 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. 2024--25 విద్యా సంవత్సరంతో పోలిస్తే రెండేళ్ల వ్యవధిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరిగింది. జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలల్లో 10 శాతానికి పైగా అదనపు విద్యార్థుల నమోదు సాధించడం విశేషంగా నిలిచింది. అలాగే మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాల్లో కూడా 10 శాతానికి పైగా విద్యార్థుల నమోదు పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో జిల్లా విద్యాశాఖ చేపట్టిన కార్యాచరణ మంచి ఫలితాలను సాధించింది. ఇదే సమయంలో 2026--27 విద్యా సంవత్సరంలో ఏకంగా 4 వేల 346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల బోధన, విద్యా ప్రమాణాలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతున్నదనే విషయాన్ని ఈ నమోదు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మార్గదర్శకత్వంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీసీఓలు, సీఆర్‌పీలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుపై నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయిలో సమన్వయం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేలా చేపట్టిన చర్యలు జిల్లాలో విద్యాభివృద్ధికి దోహదపడ్డాయి. జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీసీఓలు, సీఆర్‌పీల సమష్టి కృషితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరగడంతో మంచిర్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో విద్యా పరిపాలనలో జిల్లా సాధించిన ప్రగతిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట ప్రతిభా పురస్కారం--2026కు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఎంపిక చేసింది. రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడం మంచిర్యాల జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. జిల్లా విద్యాభివృద్ధికి కృషి చేసిన అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీసీఓలు, సీఆర్‌పీలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల నమోదు పెంపు దిశగా మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ప్రేరణనిస్తుందని అధికారులు అన్నారు .



# తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక శతావధాని డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్

## మంచిర్యాలలో ఘనంగా సంపూర్ణ ఏకదిన శతావధానం

**మంచిర్యాల, 5, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలుగు సాహిత్య పరిరక్షణ తో పాటు భాషా అభివృద్ధికి అవధాన ప్రక్రియ ఎంతో దోహదపడుతుందని పలువురు సాహితీవేత్తలు, కవులు, కళాకారులు పేర్కొన్నారు. అవధానం ద్వారా పాండిత్య ప్రతిభ, ఏకాగ్రత, ధారణా శక్తి, సమయస్ఫూర్తి, సృజనాత్మకత వెలుగులోకి వస్తాయని వారు అన్నారు. మంచిర్యాలలోని జన్మభూమి నగర్‌లో ఉన్న జ్యోతిబా పూలే సమావేశ మందిరంలో ఖండోభ ప్రసన్న సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు దండనాయకుల వామన్‌రావు అధ్యక్షతన తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక శతావధానిగా పేరుపొందిన శతావధాన షడానన, శతావధాన పూర్ణచంద్ర, శతావధాన భట్టవర్ధన, శతావధాన ద్యుమణి, శతావధాన కళాప్రపూర్ణ, చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్ ఆధ్వర్యంలో సంపూర్ణ ఏకదిన శతావధానంను ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం రాత్రి వరకు నిరాఘాటంగా కొనసాగింది. చుట్టుపక్కల ప్రాంతాలు, సమీప పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలో సాహిత్యాభిమానులు, కవులు, కళాకారులు, పృచ్ఛకులు, విద్యార్థులు హాజరై శతావధాన కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ ఏకదిన శతావధానంలో 25 సమస్యా పూరణలు, 25 దత్తపూరణలు, 25 వర్ణనలు, 25 ఆశువులు కలిపి మొత్తం 100 అంశాలను పృచ్ఛకులు అవధాని ముందుంచారు. ప్రాచీన, ఆధునిక, ప్రకృతి, వివిధ సామాజిక సన్నివేశాలకు సంబంధించిన క్లిష్టమైన ప్రశ్నలు, సమస్యలు, సవాళ్లను పృచ్ఛకులు సంధించగా, అవధాని డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్ ఎంతో చాకచక్యంగా, అద్భుతమైన ధారణా శక్తితో, సమయస్ఫూర్తితో వాటికి సమాధానాలు, పూరణలు అందించారు. అప్పటికప్పుడు చెప్పడం, అప్పజెప్పిన అంశాలను




అక్కడికక్కడే పూరించడం అవధాన ప్రక్రియ ప్రత్యేకత కాగా, పృచ్ఛకులు అడిగిన అంశాలకు అవధాని అక్కడికక్కడే సమాధానాలు చెప్పి తన అసాధారణ పాండిత్య ప్రతిభను చాటారు. ఆయన ధారణ, సమయస్ఫూర్తి, ఆశువుగా పద్యాలను పూరించిన తీరు సభికులను విశేషంగా ఆకట్టుకోగా, హర్షధ్వానాలు, కేరింతల మధ్య కార్యక్రమం ఘనంగా కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శతావధానిగా డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్ పేరు ప్రఖ్యాతులు సంపాదించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ముఖ్యంగా అవధాన ప్రక్రియను విద్యార్థులకు చేరువ చేసేందుకు ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆయన మార్గదర్శకత్వంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కార్యక్రమంలో పాల్గొని తెలుగు భాష, సాహిత్యంపై విషయ అవగాహనను పెంపొందించుకోవడం ద్వారా ఈ ప్రక్రియ విద్యార్థులకు, కవులకు, అవధానులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో సాహిత్యంపై ఆసక్తిని పెంచడంతో పాటు భాషా పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అవధానం కేవలం భాషా పాండిత్యాన్ని ప్రదర్శించే ప్రక్రియ మాత్రమే కాదని, ఏకాగ్రత, ధారణ, సమయస్ఫూర్తి, సృజనాత్మకతను పెంపొందించే గొప్ప మేధో



ప్రక్రియ అని పలువురు తెలిపారు. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలు, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, సమయస్ఫూర్తితో పరిష్కరించుకుని ముందుకు సాగాలనే సందేశాన్ని కూడా అవధానం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను భావితరాలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్ ఇప్పటికే 136 అష్టావధానాలు, 5 శతావధానాలు నిర్వహించి విశేష గుర్తింపు పొందారని నిర్వాహకులు తెలిపారు. వచ్చే జనవరిలో ఆయన సహస్రావధానం నిర్వహించబోతున్న నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, అవధానులు, సాహిత్యాభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అవధాన రంగంలో ఆయన మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి వేదాంతం సురేష్‌బాబు సంచాలకులుగా వ్యవహరించారు. అనంతరం ఖండోభ ప్రసన్న సాహితీ సాంస్కృతిక సంస్థ కార్యవర్గ సభ్యులు డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాహిత్యాభిమానులు, కవులు, కళాకారులు, పృచ్ఛకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవధాని చేసిన అద్భుతమైన పూరణలను ఆస్వాదించారు. తెలుగు భాషా సాహిత్య పరిరక్షణ, అభివృద్ధికి అవధాన ప్రక్రియను మరింత విస్తృతంగా ప్రోత్సహించాలని పలువురు ఆకాంక్షించారు.

## గురుభక్తికి నిలువెత్తు నిదర్శనం

**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా**

**విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అమూల్యం**

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును గురుభక్తిని తనకు విద్యను అందించి, జీవితంలో మంచి మార్గంలో నడిచేలా చేసిన గురువులను,టీచర్లను ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి మనిషి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు విద్యాబుద్ధులు నేర్పి జీవితాన్ని తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. గురువులు చెప్పే ప్రతి మంచి మాట విద్యార్థి భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. తన జీవితంలో తాను సాధించిన ప్రతి విజయం వెనుక గురువులు అందించిన విద్య, క్రమశిక్షణ, ప్రోత్సాహం, విలువలు ఎంతో ఉన్నాయని అన్నారు. చిన్న వయసులో గురువులు చెప్పిన మాటలు, ఇచ్చిన సూచనలు అప్పట్లో సాధారణంగా అనిపించినా.. జీవితంలో ముందుకు సాగుతున్న కొద్దీ వాటి విలువ మరింతగా అర్థమవుతోందని తెలిపారు."గురువు అంటే ఒక పాఠం చెప్పి వెళ్లిపోయే వ్యక్తి కాదు.. విద్యార్థి భవిష్యత్తును నిర్మించే శిల్పి. మనలోని ప్రతిభను గుర్తించి, తప్పులను సరిదిద్ది, మంచి మార్గంలో నడిపించే వ్యక్తి గురువు. అందుకే గురువుల పట్ల ఎప్పటికీ గౌరవం ఉండాలి" అని అన్నారు. జీవితంలో ఎంత ఎదిగినా తనకు అక్షర జ్ఞానం అందించిన గురువులను మరచిపోనని స్పష్టం చేశారు. ఉద్యోగం, హోదా, ఆర్థిక స్థితి ఏదైనా.. మన ఎదుగుదలకు తొలి మెట్టు వేసిన గురువులను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.గురువులు కేవలం పుస్తకాల్లోని పాఠాలను మాత్రమే బోధించరని, సమాజంలో ఎలా మెలగాలి, పెద్దలను ఎలా గౌరవించాలి, కష్టపడి ఎలా ముందుకు సాగాలి, మంచితనంతో ఎలా జీవించాలి వంటి అనేక జీవిత పాఠాలను నేర్పిస్తారని తెలిపారు. విద్యార్థి జీవితంలో గురువుల బోధనలు చెరగని ముద్ర వేస్తాయని పేర్కొన్నారు. నేటి విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గురువులు చెప్పే మంచి విషయాలను శ్రద్ధగా విని జీవితంలో ఆచరిస్తే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. గురువులను గౌరవించే సంస్కృతి ప్రతి కుటుంబంలో, ప్రతి విద్యాసంస్థలో మరింత బలపడాలని ఆకాంక్షించారు.

**గురువు రుణం ఎప్పటికీ తీర్చలేనిది**

మనం ఎంత ఎదిగినా మనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును ఒక్కసారి గుర్తు చేసుకుంటే చాలు.. మన ఎదుగుదల వెనుక ఉన్న వారి కృషి కళ్లముందు కనిపిస్తుంది. గురువుకు గౌరవం ఇవ్వడం ద్వారా మన విద్యకు, మన గతానికి, మన ఎదుగుదలకు గౌరవం ఇచ్చినట్లే" అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువును సన్మానించుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. గురువు ఆశీస్సులు జీవితాంతం తనపై ఉండాలని కోరుకున్నారు. భవిష్యత్‌లో కూడా గురువుల మార్గదర్శకత్వాన్ని తీసుకుంటూ సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుకు సాగుతానని అన్నారు. గురువు చూపిన మార్గంలో నడిచి జీవితంలో ఎదిగిన శిష్యుడు.. అదే గురువును తిరిగి గౌరవంగా గురు-శిష్యుల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం, గౌరవం, కృతజ్ఞతాభావం ఈ



సందర్భంగా మరోసారి వెలుగులోకి వచ్చింది. గురువు చేతిలో నేర్చుకున్న అక్షరం.. జీవితంలో వెలుగునిచ్చే దీపం. గురువు చూపిన మార్గం.. భవిష్యత్తుకు బాట. గురువును గౌరవించడం.. మన ఎదుగుదలకు కారణమైన విలువలను గౌరవించడమే అనే సందేశం చాటిచెప్పాలి.

# బదిలీపై కార్పొరేట్‌కు వెళ్తున్న అధికారులకు జీఎం మునిగంటి శ్రీనివాస్ సన్మానం



**మంచిర్యాల, 5, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియా నుంచి బదిలీపై సింగరేణి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్తున్న ఏజీఎం (ఫైనాన్స్) శ్రీమతి సుమలత, డీజీఎం (ఇంటర్నల్ ఆడిట్) దామోదర్ రావులను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏరియా అధికారులు పాల్గొని బదిలీపై వెళ్తున్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీరాంపూర్ ఏరియా ఏజీఎం (ఫైనాన్స్)గా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి సుమలత, డీజీఎం (ఇంటర్నల్ ఆడిట్)గా పనిచేస్తున్న దామోదర్ రావులు సింగరేణి కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. శ్రీరాంపూర్ ఏరియా నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ వారి సేవలను కొనియాడుతూ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీమతి సుమలత, దామోదర్ రావులు శ్రీరాంపూర్ ఏరియాలో స్వల్పకాలమే పనిచేసినప్పటికీ తమకు అప్పగించిన బాధ్యతలను ఎంతో నిబద్ధతతో నిర్వర్తించి, ఆయా హోదాల్లో మెరుగైన సేవలు అందించారని ప్రశంసించారు. కార్పొరేట్ కార్యాలయంలోనూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. వారి భవిష్యత్ ఉద్యోగ ప్రస్థానం విజయవంతంగా సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి. రెడ్డి, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (సేఫ్టీ) విజయ్ కుమార్, డీజీఎం (స్టోర్స్) మల్లేష్, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సీహెచ్పీ ఇన్‌చార్జి చంద్రలింగం, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, ఎన్విరాన్ మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# దండేపల్లిలో ప్రభుత్వ పథకాలు, సీజనల్ వ్యాధులపై కళాకారుల చైతన్య కార్యక్రమం

**దండేపల్లి, సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో శనివారం దండేపల్లి మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం చేత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు, వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కళాకారులు తమ ఆటపాటల ద్వారా గ్రామీణులకు చైతన్యం పరిచారు.

**ముత్యాల శ్రీనివాస్‌కు సన్మానం:**

నెల్కి వెంకటాపూర్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ముత్యాల శ్రీనివాస్‌ను మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆలోచనలకు అనుగుణంగా సాంస్కృతిక సారథి కళాకారులు పాటల ద్వారా సందేశాన్ని ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన ద్వారా ఎలాంటి దళారులు, మధ్యవర్తులు లేకుండా పేద ప్రజల గడప గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందాలని స్పష్టం చేశారు.



**కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, ప్రముఖులు:**

ఈ చైతన్య కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ముల్కల్ల మురళి, లావుడ్యా రమేష్, మామిండ్ల లచ్చన్న, వెల్తూరు పోశం, గొడిసెల కృష్ణ, మిట్టపల్లి సంధ్య, చేగొండ నిరోష, తస్లీమా తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు గడిపెల్లి సత్యం, సంఘ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## వెలుగనూరు ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

?**దండేపల్లి సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి ):** దండేపల్లి మండలం వెలుగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న గురువులపై గౌరవాభిమానాలను చాటుకున్నారు. ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని, వారి మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇన్చార్జి ఉపాధ్యాయుడు బి. రాజన్న, ఇతర ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## దండేపల్లిలో కుక్కలు, కోతుల బెడద తీర్చాలని వినతి



**దండేపల్లి, సెప్టెంబర్05(ప్రజాజ్యోతి):** గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న కుక్కలు, కోతుల బెడద నుంచి తమకు విముక్తి కలిగించాలని కోరుతూ దండేపల్లి గ్రామస్థులు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆశ్రయించారు. శనివారం మండల కేంద్రంలో సర్పంచ్ అజ్మీర రాజేశ్వర్ నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హరీష్‌లకు గ్రామస్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువై పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని, భయందోళనల మధ్య జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కోతుల గుంపులు ఇళ్లపైబడి ఆహార పదార్థాలను పాడుచేస్తూ, ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు.గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టి, కుక్కలు, కోతుల బెడద నుంచి తమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలి

### డిమాండ్ల సాధన కై 8న 'చలో హైదరాబాద్'



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 5 ప్రజా జ్యోతి** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్--సీఐటీయూ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మెరుగైన పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు తగిన వేతనం, ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమని సీఐటీయూ జిల్లా జాయింట్ సెక్రటరీ వెలిశాల కృష్ణమాచారి అన్నారు.ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సెప్టెంబరు 8న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఉదయం 10 గంటలకు జరిగే 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్--సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు కే.స్వరూప, జిల్లా నాయకులు అమరవాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## గురువుకు ఘన సన్మానం.. గురుభక్తిని చాటుకున్న 'జై మీడియా' అధినేత నరేందర్



**దండేపల్లి, సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి):**ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువుపై ఉన్న గౌరవాన్ని, గురుభక్తిని చాటుకున్నారు 'జై మీడియా' అధినేత నరేందర్. మంచిర్యాల జిల్లాలోని స్వాతి స్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న నరేందర్, అనంతరం హైదరాబాద్ వెళ్లి అంచెలంచెలుగా ఎదుగుతూ జై మీడియా అధినేతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు, ఉపాధ్యాయుడు ఏ. మనోహర్‌ను నరేందర్ ఘనంగా సన్మానించారు. గురువుకు శాలువా కప్పి, సత్కరించి తన కృతజ్ఞతను చాటుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. తన జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి గురువులు అందించిన విద్య, క్రమశిక్షణ, విలువలు ఎంతగానో దోహదపడ్డాయని పేర్కొన్నారు. తాము ఎంత ఎదిగినా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరచిపోనని చెప్పారు. గురువు చూపిన మార్గంలో నడిచి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకున్న శిష్యుడు, అదే గురువును తిరిగి సన్మానించడం గురు–శిష్యుల అనుబంధానికి ప్రతీకగా నిలిచింది.

## బీసీలకు అన్యాయం జరిగితే ఊరుకోం

### బీసీలకు మాటలు కాదు.. వాటా, అధికారం కావాలి



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 5 ప్రజా జ్యోతి** బీసీలకు అన్యాయం జరిగితే మౌనంగా ఉండబోమని మున్నూరు కాపు సంఘం పటేల్స్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి కొండా సురేఖ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. సుస్మిత వ్యాఖ్యలకు కొండా సురేఖను బాధ్యురాలిని చేయడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం వివరించాలన్నారు. తప్పు చేసిన వారిని గుర్తించి, నిజమైన బాధ్యులపైనే చర్యలు తీసుకోవాలని, క్రమశిక్షణ చర్యల్లో అందరికీ సమాన న్యాయం ఉండాలని అన్నారు. వెనుకబడిన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు ఇప్పటివరకు మంత్రి పదవి దక్కలేదని లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ దండే విఠల్‌కు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీతోపాటు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లోని హామీలను అమలు చేయాలని కోరారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడొద్దని, తమకు వాటా, హక్కు, అధికారం కావాలని స్పష్టం చేశారు. బీసీల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని గజ్జల లక్ష్మణ్ తెలిపారు.

## మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక.




**జన్నారం,సెప్టెంబర్5(ప్రజాజ్యోతి)** జన్నారం మండల మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా గుండ పవన్ కుమార్, అధ్యక్షుడిగా ఎస్.కె మౌలానా, ఉపాధ్యక్షుడిగా గోలి భాను చందర్, ప్రధాన కార్యదర్శిగా గోనె శిరీష సత్యం, కోశాధికారిగా కైరం మనోజ్, సభ్యులుగా గద్దం తిరుపతి, తొట్ల అజయ్ కుమార్, సయ్యద్ ఇమ్రాన్, కిరణ్ నాయక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మౌలానా మాట్లాడుతూ మీసేవ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ భద్రతే కీలకం

### గణేష్ మండపాలు, నిమజ్జన మార్గాల్లో ప్రత్యేక తనిఖీలు

### ముందస్తు చర్యలతో విద్యుత్ ప్రమాదాల నివారణ: ఎస్ఈ ఉత్తమ్ జాడే



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 5 ప్రజా జ్యోతి** వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఆసిఫాబాద్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలు, విద్యుత్ అలంకరణలు, విగ్రహాల తరలింపు, నిమజ్జన సమయంలో నిర్వాహకులు, భక్తులు, ప్రజలు, విద్యుత్ సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.నిమజ్జన మార్గాల్లో విగ్రహాలు, ట్రక్కులు, క్రేన్ల ఎత్తును దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సిబ్బంది ముందుగానే క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాల వద్ద ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ తీగలు, సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని, తడి ప్రదేశాల్లో విద్యుత్ పరికరాలను ఉపయోగించవద్దని ఎస్ఈ సూచించారు.

# కాంగ్రెస్ 1000 రోజుల ప్రజాపాలనకు జేజేలు!

**ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు**

**డీసీసీ జిల్లా అధ్యక్షురాలిని కలిసిన పులికుంట గ్రామ కాంగ్రెస్ నాయకుడు ఇప్ప రమేష్**

**ఆసిఫాబాద్ ఆర్సీ,సెప్టెంబర్ 05 (ప్రజాజ్యోతి):**కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో రెబ్బెన మండలం పులికుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇప్ప రమేష్ డీసీసీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ను మర్యాదపూర్వకంగా కలిసి 1000 రోజుల పాలనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటే కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల ఆశలకు ప్రతీక అని అన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే పార్టీగా కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజల కోసం పోరాడే నాయకత్వం, కార్యకర్తల అంకితభావం కాంగ్రెస్ పార్టీకి ప్రధాన బలమని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం ఏర్పడిందన్నారు. రైతులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు అందించడం, యువతకు అవకాశాలు కల్పించడం, పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల మాటకు విలువ ఉంటుంది.. ప్రజల సమస్యే ప్రభుత్వ సమస్యగా భావించే విధానం ఉంటుంది అని ఆయన అన్నారు. గ్రామాల్లోని సమస్యలను నాయకులు, కార్యకర్తలు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ కార్యకర్తలు వారధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పులికుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న బలమైన ప్రజా మద్దతును మరింత పెంచేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తామని చెప్పారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం ద్వారా రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాభిమానం లభించేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. డీసీసీ జిల్లా అధ్యక్షురాలి నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి మార్గనిర్దేశం చేయడం అభినందనీయమన్నారు. గ్రామస్థాయి కార్యకర్తలకు ప్రోత్సాహం అందిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్న జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలం అని పేర్కొంటూ.. పదవులు, హోదాలతో సంబంధం లేకుండా ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ జెండాను గ్రామగ్రామాన బలంగా నిలబెట్టేందుకు కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 1000 రోజుల పాలన అనేది కేవలం ఒక సంఖ్య కాదని.. ప్రజలతో కలిసి సాగిన ప్రయాణానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. పేదల ముఖాల్లో చిరునవ్వు, రైతుల జీవితాల్లో భరోసా, యువతలో నమ్మకం, మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగే విధంగా పాలన కొనసాగాలని కోరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్షాలు చేసే విమర్శలకు



వాస్తవాలతో సమాధానం చెబుతూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో పులికుంట గ్రామంతో పాటు రెబ్బెన మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలమైన పునాది ఏర్పడేలా కృషి చేస్తామని అన్నారు.ఈ సందర్భంగా డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సుగుణని కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకత్వం, కార్యకర్తల సమిష్టి కృషితో ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ బలోపేతమే ధ్యేయంగా.. పెంటు ప్రత్యేక పాత్ర

**కార్యకర్తలకు భరోసా.. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం**

**సెల్వట్కార్ పెంటు ఉపాధ్యక్షుడు**

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్05 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పెంటు పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తూ తనదైన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసంతో ముందుకు సాగుతూ, పార్టీ కార్యక్రమాలను విజయ వంతం చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా తన వంతు సహకారం అందించేందుకు ముందుండే నాయకుడిగా పెంటు గుర్తింపు పొందుతున్నారు.

**కార్యకర్తలే పార్టీకి బలం..**

కాంగ్రెస్ పార్టీకి గ్రామస్థాయిలో కార్యకర్తలే అసలైన బలమని భావించే పెంటు.. ప్రతి కార్యకర్తతో సన్నిహితంగా ఉంటూ వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో భాగ స్వామిగా ఉంటూ, పార్టీ కోసం పనిచేసే వారికి ప్రోత్సాహం అందిస్తు న్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ, నాయకత్వం కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

**ప్రజా సమస్యలపై స్పందన..**

రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలపై కూడా పెంటు స్పందిస్తున్నారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడటం, వారి సమస్యలను వినడం ద్వారా పార్టీకి ప్రజలకు మధ్య మరింత అనుబంధం ఏర్పడేలా కృషి చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలు, కార్యక్రమాలు, ప్రజా సంబంధ కార్యక్రమాల్లో పెంటు చురుకుగా పాల్గొంటున్నారు. పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును కార్యకర్తలకు చేరవేస్తూ, కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సమన్వయం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ శ్రేణులతో సమావేశమై పార్టీ పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్నారు.

**పదవి కంటే బాధ్యతకే ప్రాధాన్యం..**

మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్ష పదవిని కేవలం హోదాగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తూ పెంటు ముందుకు సాగుతున్నారని ఆయనను దగ్గరగా చూసిన పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, పార్టీకి అవసరమైన సమయంలో ముందుండి పనిచేయడమే తన లక్ష్యమని ఆయన చెబుతున్నారు.

**యువతకు ప్రోత్సాహం..**

మండలంలోని యువతను రాజకీయంగా చైతన్యవంతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలపై స్పందించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పెంటు భావిస్తున్నారు. యువతకు పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ, వారి ఆలోచనలు మరియు సూచనలను స్వీకరించే ప్రయత్నం చేస్తున్నారు. యువత ముందుకు వస్తేనే గ్రామస్థాయి నుంచి పార్టీ మరింత బలోపేతం అవుతుందనే అభిప్రాయంతో పనిచేస్తున్నారు. ఐక్యతే విజయానికి మార్గమంటూ.. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య ఐక్యత, సమన్వయం ఉంటేనే పార్టీ మరింత బలపడుతుందని పెంటు తరచూ కార్యకర్తలకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా పార్టీ



ప్రయోజనాల కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు నిస్తున్నారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి మండల స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరి కృషిని గుర్తిస్తూ ముందుకు సాగుతున్నారు.

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడమే లక్ష్యం..**

రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావని, ప్రజల విశ్వాసమే అసలైన బలమని పెంటు భావిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, కార్యకర్తలకు అండగా నిలవడం, పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా తన బాధ్యతను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తూ.. కార్యకర్తలకు భరోసాగా నిలుస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న పెంటు, వాంకిడి మండల కాంగ్రెస్‌లో తనదైన శైలిలో పనిచేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారు. రాబోయే రోజుల్లో మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన శక్తిమేర కృషి చేస్తానని ఆయన స్పష్టం చేస్తున్నారు.

# పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

## ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

### 286 మంది లబ్ధిదారులకు రూ.1.05 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**మంచిర్యాల, 5, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆపన్నహస్తంగా నిలుస్తోందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ (మంచిర్యాల, నస్పూర్)తో పాటు హాజీపూర్ మండలానికి చెందిన 286 మంది లబ్ధిదారులకు రూ.1,05,47,100 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శనివారం పంపిణీ చేశారు. మంచిర్యాలలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖమ్మ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్య సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక ఆపన్నహస్తంగా మారిందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరమైన సమయంలో వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, వైస్ చైర్మన్ జాలె రాయలింగు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో ఎలక్ట్రీషియన్ మృతి.



**జన్నారం,సెప్టెంబర్5(ప్రజాజ్యోతి)** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై ప్రైవేట్ ఎలక్ట్రిషన్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జన్నారం గ్రామానికి చెందిన మహమ్మద్ వలియోద్దీన్(45) అనే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ఇంటి సమీపంలో ఉన్న వారి ఇంటి విద్యుత్ మోటారు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురయ్యాడు. బంధువులు స్నేహితులు వెంటనే ఆయనను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య షబానా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు. భార్య, పిల్లలు ,బంధువుల రోదన పలువురిని కంటతడి పెట్టించాయి. తల సేమియాతో బాధపడు తున్న కుమారుడు చికిత్స నిమిత్తం ఎంతో కష్టపడేవాడని, ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు.

# రాముని చెరువు వాకర్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**మంచిర్యాల, 5, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై వాకర్స్ సభ్యుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజూ రాముని చెరువు కట్టపై వాకింగ్, జాగింగ్‌కు వచ్చే ఉపాధ్యాయులను వాకర్స్ సభ్యులు ఆత్మీయంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు పూల బొకేలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గజెల్లి వెంకటయ్య, రాముని చెరువు వాకర్స్ సభ్యుడు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం రాముని చెరువు అభివృద్ధి, సుందరీకరణతో పాటు వాకింగ్ ట్రాక్‌ను మెరుగుపర్చేందుకు వాకర్స్ సభ్యులంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా కృషి చేయాలని వెంకటయ్య కోరారు. ప్రతిరోజూ వాకింగ్, జాగింగ్ కోసం చెరువు కట్టకు వచ్చే వాకర్స్‌కు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా కట్టపైకి కోతులు, శునకాలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాకింగ్ ట్రాక్‌ను బాగు చేసి, వాకర్స్‌కు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు చెరువు పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. రాముని చెరువు అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, కోతులు, శునకాల సమస్య తదితర అంశాలను సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం రాముని చెరువు వాకర్స్ సభ్యులందరూ ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా వాకర్స్ అందరూ ఏకమై రాముని చెరువు అభివృద్ధి, సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ సంరక్షణ, వాకర్స్ భద్రత కోసం కృషి చేస్తే సమస్యలను త్వరగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని గజెల్లి వెంకటయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రాముని చెరువు వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# దండేపల్లిలో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**దండేపల్లి, సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల విద్యాధికారిమంత్రి రాజు ఆధ్వర్యంలో దండేపల్లి మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. సమాజ వికాసానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు.ఈ కార్యక్రమానికి జిల్లా బాలికల విద్యాధికారిణి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై, మండల పరిధిలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ గుణాత్మక విద్యను అందించడంలో ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నిర్వహణ అధికారి ఎమ్ఎమ్ వో దుర్గం చిన్నయ్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంఘర్స్ రాజేశ్వర్ రావు, రోజీ వర కుమారి, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు

### సదరం శిబిరాల్లో మౌలిక వసతులు కల్పించాలి: కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 5 ప్రజా జ్యోతి** సదరం శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సదరం శిబిరాన్ని ఆమె సందర్శించి దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదరం శిబిరాల్లో దివ్యాంగులకు నిర్వహించే వైద్య పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనున్న శిబిరాలకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చే దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య పరీక్షల కోసం వచ్చే వారికి తాగునీరు, కూర్చునే వసతి తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.